1

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

బుధవారం | 11 అక్టోబర్ 2023 | www.navatelangana.com

బీఆర్ఎస్‌లోకి తీన్మార్ మల్లన్న టీం మండలాధ్యక్షుడు

నవతెలంగాణ-జోగిపేట



ఆందోల్ మండలంలోని కొండారెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ కవిత బాల్‌సింగ్ ఆధ్వర్యంలో తీన్మార్ మల్లన్న టీం అందోల్ మండలాధ్యక్షులు మాదిగి మంగలి శంకర్ మంగళవారం బీఆర్ ఎస్‌లో చేరారు. జోగిపేటలోని పార్టీ కార్యాలయంలో అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ సమక్షంలో బీఆర్ఎస్ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ రాష్ట్రంలో చేపడుతున్న సంక్షేమ పథకాలు అభివృద్ధిని చూసి పార్టీలోకి వస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల రైతుబంధు అధ్యక్షులు అశోక్, మండల పార్టీ అధ్యక్షులు లక్ష్మీకాంత్ రెడ్డి ఉన్నారు.

నిజాంపేట పీహెచ్‌సీలో అడిషనల్ కలెక్టర్ తనిఖీలు

నవతెలంగాణ-కల్హేర్



మండల కేంద్రమైన నిజాంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని(పీహెచ్‌సీ) అడిషనల్ కలెక్టర్ రవీందర్ నాయక్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు తీరును.. రికార్డులను, దస్త్రవేజులను పరిశీలించారు. ఎన్ఎల్ ఈపి, ఎన్‌సిడి ఫ్యామిలీ వెల్ఫేర్ ప్రోగ్రాంలో పై రివ్యూ మీటింగ్లో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఏఎంసి రిజిస్ట్రేషన్ పకడ్బందీగా వివరాలు నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. ఆరోగ్య కేంద్రంలో ఓపి సేవలను ఏం సి రిజిస్ట్రేషన్ పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేస్తూ సిబ్బందిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ రాహుల్ చౌహాన్ అభినందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ ఓ డాక్టర్ సంతోష్, డాక్టర్ బి రాజేశ్వర్, ఎంపిహెచ్ ఎ మేల్ జట్ల భాస్కర్, పరశురాం, డిపిఎంఓ కే మారుతి, ప్రతాప్ గౌడ్, హెల్త్ సూపర్వైజర్ర్లు కిరణ్ సుజాత, ఏఎన్ఎంలు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకుల కోసం దరఖాస్తులు ఆహ్వానం

నవతెలంగాణ-పటాన్‌చెరు

పటాన్‌చెరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ సబ్జెక్టులో ఒక (01) గెస్ట్ ఫ్యాకల్టీ కోసం దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్టు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.రాజేంద్ర ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. పీజీకామర్స్ (పోస్ట్ గ్రాడ్యుయేషన్)లో 55 శాతం మార్కులు పొంది ఉన్నవారు అర్హులన్నారు. అలాగే నెట్, స్టేట్ సెట్, పీహెచ్‌డీ ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. అభ్యర్థులు అన్ని సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలతో ఈనెల 12న (గురువారం) సాయంత్రం నాలుగు గంటల లోపు ప్రభుత్వ డిగ్రీ కళాశాల కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో 13న ఉదయం 10 గంటలకు ,తారా ప్రభుత్వ కళాశాల సంగారెడ్డిలో ఇంటర్వ్యూ (మౌఖిక పరీక్ష)కు హాజరు కావాలన్నారు.



టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఎంఈఓకు సన్మానం

నవతెలంగాణ-మునిపల్లి

బదిలీపై మండలానికి వచ్చిన ఎంఈఓ దశరథ్‌ను టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమాన్ని మండల కేంద్రమైన మోడల్ స్కూల్‌లో నిర్వహించారు. అలాగే మండల నోడల్ ఆఫీసర్‌గా భాస్కర్‌ను నియమించడంతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీటీఎఫ్ మండల టీం సభ్యులు లక్ష్మణ్, గోపాల్, ఖమ్రోద్దీన్, భాస్కర్, ప్రవీణ్, గోవర్ధన్, అమిరుద్దీన్, సంతోష్, నవీన్, ముజాఫరుద్దీన్, సంతోషమ్మ రాణి, శ్రీరామ్, సత్యవాణి, చరణ్ తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్‌ను అవమానించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-జోగిపేట


అందోల్ నియోజకవర్గ పరిధిలోని వట్‌పల్లి మండలం ఉసిరికపల్లి గ్రామంలో గల డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని అవమానించిన వ్యక్తి పైన కఠిన చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమెల మాణిక్, సామాజిక ప్రజాసంఘాల జిల్లా అధ్యక్షులు ఆందోల్ మల్లేశంలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సామాజిక ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మంగళవారం జోగిపేటలో సీఐ నాగరాజుకు వినతి పత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహాల జోలికి వస్తే ఖబర్దార్ అంటూ హెచ్చరించారు. మునుముందు ఇలాంటి ఘటనలు జరగకుండా ప్రభుత్వం పోలీసులు గట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సామాజిక ప్రజాసంఘాల నాయకులు దాసరి దుర్గయ్య, భాను తేజ, చెట్ల య్యా ధనరాజ్, బాల్రాజ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ హయాంలో ప్రజలకు కష్టాలు

నవతెలంగాణ-పుల్కల్

తెలంగాణ రాష్ట్రాన్ని గత తొమ్మిదిన్నర ఏండ్లుగా పాలించిన బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ రాష్ట్ర ప్రజలు ఎన్నో అష్ట కష్టాలు పడ్డారని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు దుర్గారెడ్డి ఆరోపించారు.పుల్కల్ మండల పరిధిలోని సింగూర్ గ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రాన్ని రావణ కాష్టంగా మార్చిన కేసీఆర్‌కు రాబోయే ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. గత ఎన్నిక ల్లో లోకల్ పేరుతో నెగ్గిన చంటి క్రాంతి కిరణ్ ఆందోల్ నియోజకవర్గంలో ఉన్న వేల ఎకరాల ప్రభుత్వ భూములను కబ్జాలు చేయడమే కాకుండా ప్రభుత్వం ద్వారా వచ్చిన సంక్షేమ పథకాలను కేవలం వారి బంధువులకు మాత్రమే ఇచ్చా రని ఆరోపించారు. రాబోయే ఎన్నికల్లో క్రాంతి కిరణ్‌కు తగిన గుణపాఠం చెబుతామన్నారు. ఈసారి ఇటు రాష్ట్రంలో, అటు కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ జెండా రెపరెప లాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ముది మాణిక్యం గ్రామ సర్పంచ్ పడమటి అరుణ యాదగిరి, సింగూర్ ఎంపీటీసీ మంజుల వీరారెడ్డి, నాయకులు ఎర్ర శేఖర్, మన్నే విజయ్ కుమార్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



బస్సుల సమయం మార్చాలి

నవతెలంగాణ-తూప్రాన్‌రూరల్ మనోహరాబాద్

ప్రజావసరానికి వీలుగా బస్సుల సమయాన్ని మార్చాలని కొండాపూర్ సర్పంచ్ చింతల మమత రవి ముదిరాజ్ ఆధ్వర్యంలో డిపో మేనేజర్‌కు మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. మనోహరాబాద్ మండలంలోని కొండాపూర్ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించడం అభినందనీయమన్నారు. ఇందుకు గ్రామ ప్రజలంతా డిపో యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలుపుతున్నారన్నారు. కానీ గత కొద్ది రోజులుగా సాయంత్రం ఐదున్నర గంటలకు రావాల్సిన ఆర్టీసీ బస్సు 7 గంటలకు వస్తుండడంతో ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజల సౌకర్యం కోసం సాయంత్రం ఐదున్నర గంటల సమయంలో ఆర్టిసి బస్సు వచ్చే విధంగా తగు చర్యలు తీసుకోవాలంటూ వారు కోరారు. ఈ కార్యక్రమంలో మండలంలోని నాయకులు విద్యార్థులు పాల్గొన్నారు.

అంతా గప్‌చుప్



అంతటా ఎన్నికల కోడ్

- మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఎఫెక్ట్
- విగ్రహాలకు ముసుగు.. ప్రచార సామాగ్రి తొలగింపు
- సభలు, సమావేశాలు, ఆందోళనలు బంద్
- ప్రభుత్వ భవనాలు.. స్థలాల్లో నో ప్రచారం
- ఆగిన ప్రారంభోత్సవాలు, శంఖుస్థాపనలు
- పోలీసుల విస్తృత తనిఖీలు.. పట్టుబడుతున్న నగదు
- పోలింగ్ కేంద్రాల పరిశీలనలో తహసీల్దార్లు

ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన వెంటనే అంతా గప్‌చుప్ అయ్యింది. సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున మహానీయులు, రాజకీయ నాయకుల విగ్రహాలకు ముగుసులు తొడిగారు. ఫ్లెక్సీలు, ప్రచార సామాగ్రి తొలగించారు. సభలు, సమావేశాలు, ఆందోళనలు, ధర్నాల సందడి ఆగిపోయింది. ప్రభుత్వ భవనాలు, స్థలాలు, కార్యాలయాలు రాజకీయ ప్రచారాలకు దూరమయ్యాయి. ప్రభుత్వ పరంగా జోరుగా సాగిన అభివృద్ధి, సంక్షేమ పథకాల ప్రారంభోత్సవాలు, శంఖుస్థాపనలు నిలిచిపోయాయి. పరిపాలనా వ్యవహారాల్లో మునిగితేలిన అధికార యంత్రాంగం నిన్నటి నుంచి వాటితో పాటు ఎన్నికల విధుల్లోనూ నిమగ్నమైంది. పోలింగ్ కేంద్రాలు, ఈవీఎం గోదాముల్ని అధికారులు పరిశీలిస్తున్నారు. పోలీస్ యంత్రాంగం విస్తృతంగా తనిఖీలు చేస్తూ నగదు, మద్యం, డ్రగ్స్ రవాణాను అరికట్టేందుకు పూనుకుంది.

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

షెడ్యూల్ వెలువడిన వెంటనే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. మూడు జిల్లాల్లోనూ కోడ్ అమల్లోకి రావడంతో పరిస్థితుల్లో ఒక్కసారిగా మార్పు వచ్చింది. సంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారిగా డాక్టర్ ఎ.శరత్, సిద్దిపేట జిల్లా ఎన్నికల అధికారిగా ప్రశాంత్‌జీవన్ పాటిల్, మెదక్ జిల్లా ఎన్నికల అధికారిగా రాజర్షి షా నేతృత్వంలో కోడ్ అమలుకు చర్యలు తీసుకుంటున్నారు. అధికార పార్టీ ప్రోటోకాల్, రాజకీయ పార్టీల కార్యక్రమాలకు బ్రేక్‌పడింది. కోడ్ అమల్లోకి రావడంతో మహనీయుల విగ్రహాలకు ముగుసు తొడిగారు. మహాత్మాగాంధీ, ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ, నెహ్రూ, అంబేద్కర్, తెలుగుతల్లి, ఎన్టీఆర్, వైఎస్ఆర్, పొట్టిశ్రీరాములు, శివాజీ వంటి ఇతర నాయకుల విగ్రహాలకు ఎన్నికలు ముగిసే వరకు ముసుగు ఉంచను న్నారు. పట్టణాలు, మండల, మున్సిపల్ కేంద్రాలతో పాటు గ్రామాల్లో సైతం రాజకీయ పార్టీలకు సంబంధించిన ఫ్లెక్సీలు, కటౌట్లు, బ్యానర్లు, గోడ రాతలు, పోస్టర్లు, తోరణాలు, జెండాలు ఇతర ప్రచారానికి సంబంధించిన వాటిని అధికారులు తొలగించారు. ప్రధాన కూడళ్లన్నీ ప్రశాం తంగా కనిపిస్తున్నాయి. గెస్ట్ హౌస్‌లు, స్టేడియాలు, మైదానాల్లో కూడా కటౌట్లు ఇతర వాటిని తీసేశారు. రాజకీయ పార్టీల సభలు, సమావేశాలు, ఆందోళనలు, ధర్నాలు, దీక్షలు, పోరాటాలకు పుల్‌స్టాప్ పడింది. అనుమతి లేకుండా ఇవేవీ నిర్వహించకూడదు. అనుమతితో కార్యక్రమాలు నిర్వ హిస్తే వాటి ఖర్చుల్ని లెక్కించి ఆ పార్టీకి చెందిన అభ్యర్థి ఎన్నికల ఖర్చుల కింద వేస్తారు. సినిమా థియేటర్లు, ఇంటర్‌నెట్, సైన్‌బోర్డ్స్ వాటిల్లోనూ ప్రభుత్వ, పార్టీలకు సంబం ధించిన ప్రచారాన్ని నిలిపివేశారు. కిరాణా కూరగాయలు, స్టేషనరీ, టెంట్‌హౌస్, సౌండ్ సిస్టం, ఫ్లెక్సీ, ప్రింటింగ్ ప్రెస్, ట్రావెలింగ్ ఏజెన్సీలతో కలెక్టర్లు సమావేశం నిర్వహించి ఎన్నికల నియమాలు పాటించాలని ఆదేశించారు. ప్రతిదీ రసీదు చూపాలి. సోషల్ మీడియా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలోనూ పేయిడ్ ఆర్టికల్స్, వ్యక్తిగత విమర్శలు, విద్వేషపూరిత ప్రసంగాలను కవర్ చేయకుండా ఈసీ నిఘా పెట్టింది.

ఆగిన ప్రారంభోత్సవాలు, శంఖుస్థాపనలు

కోడ్ ఎఫెక్ట్‌తో ప్రభుత్వం, ఫౌండేషన్లు, స్వచ్ఛంద సంస్థలు చేసే ప్రారంభోత్సవాలు, శంఖుస్థాపనలు ఆగిపోయాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన అభివృద్ధి పనుల్ని ప్రారంభించడం, కొత్త వాటికి శంఖుస్థాపనలు జరిగేది. మంత్రి హరీశ్‌రావు సుడిగాలి పర్యటనలు చేస్తూ 11 నియోజకవర్గాల్లోనూ వందల కోట్ల వ్యయంతో చేపట్టిన పనుల్ని ప్రారంభించడం, శంఖుస్థాపనలు చేయడం చేశేది. అదంతా ఆగిపోయింది. గ్రామాలు, మున్సిపాలిటీల్లోనూ ఎమ్మెల్యేల అధికారిక పర్యటనలు, సమీక్షలు, పంపిణీలు నిలిచిపోయాయి. పంచాయతీ, మున్సిపల్, జెడ్పీ సర్వసభ్య సమావేశాలు నిర్వహించకూడదు. ఎమ్మెల్యేలకు ఇచ్చిన సీడీపీ నిధులతో అనేక పనులను చేపట్టాల్సి ఉండగా కోడ్ వల్ల ఆగిపోయాయి. సీఎం కేసీఆర్ పటాన్‌చెరు, మెదక్ జిల్లాల్లో పర్యటించిన సందర్భంగా మున్సిపాల్టీలు, పంచాయతీలకు ప్రత్యేక మంజూరు చేసిన పనులు కూడా ముందుకు సాగవు.

పోలీసుల తనిఖీలు...పోలింగ్ కేంద్రాల పరిశీలన

కోడ్ వచ్చిన వెంటనే పోలీసులు రంగంలోకి దిగారు. సోమవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పోలీసులు తనిఖీలకు పూనుకున్నారు. సంగారెడ్డి జిల్లా సరిహద్దు మహారాష్ట్ర, కర్ణాటక ఉన్నందున అక్కడి నుంచి మద్యం, డ్రగ్స్, డబ్బులు, ఇతర వస్తువుల్ని తరలించే అవకాశమున్నందున జిల్లా వ్యాప్తంగా ఏడు చెక్‌పోస్టుల్ని ఏర్పాటు చేసి గట్టి నిఘా పెట్టినట్లు ఎస్పీ రమణకుమార్ తెలిపారు. సోమవారం డీఎస్పీ రమేష్‌కుమార్ నేతృత్వంలో తనిఖీలు చేయగా పోతిరెడ్డిపల్లి చౌరస్తాలో ఏలాంటి ఆధారాలు లేకపోవడంతో రూ.7 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. రూ.50 వేల కంటే ఎక్కువ నగదును తరలించితే వాటికి రసీదులు, ఆధారాలు చూపించాలి. సిద్దిపేట, మెదక్ జిల్లాల్లోనూ పోలీసులు ప్రధాన రహదారుల్లో తనిఖీలు చేస్తున్నారు. అదే విధంగా ఎన్నికలకు సంబంధించి ముఖ్యమైన పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్లు మంగళవారం పరిశీలించారు. సంగారెడ్డి జిల్లాలో 1594, సిద్దిపేట జిల్లాలో 1151, మెదక్ జిల్లాలో 579 పోలిగ్ కేంద్రాలను గుర్తించారు. ఆయా మండలాల్లోని పోలింగ్ కేంద్రాలను స్థానిక తహసీల్దార్లు పరిశీలిస్తున్నారు. ఓటర్లకు అవసరమైన నీడ, నీళ్ళ, కరెంట్ సదుపాయం, వికలాంగులకు ర్యాంప్ సదుపాయం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

50 రోజులు నా గురించి కష్టపడండి..

5 ఏండ్లు మీ సేవలో ఉంటా

- ఆర్థిక వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు
- సిద్దిపేటలో 17న జరిగే సీఎం కేసీఆర్ సభకు జనసమీకరణ.. సభా సమాయత్తం పై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం

నవతెలంగాణ-సిద్దిపేట

'ఈ 50 రోజులు నా గురించి కష్టపడండి... 5 ఏండ్లు మీ సేవలో ఉంటాను' అని మంత్రి హరీశ్‌రావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సిద్దిపేటలో ఈనెల 17 న జరిగే సీఎం కేసీఆర్ సభకు జనసమీకరణ, సభా సమాయత్తం పై పార్టీ శ్రేణులతో మంగళవారం క్యాంప్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో అద్భుతమైన మెజారిటీతో దేశ స్థాయిలో సిద్దిపేట గౌరవాన్ని పెంచారని, ఆ దిశగా అభివృద్ధి చేసి జాతీయ స్థాయిలో సిద్దిపేట ప్రతిష్టను పెంచానన్నారు. సిద్దిపేట ప్రజలే తన కుటుంబ సభ్యులుగా, తాను సిద్దిపేట ప్రజల కుటుంబ సభ్యునిగా నిరంతరం అభివృద్ధికి పాటు పడుతున్నారు. అందుకు సిద్దిపేట ప్రజలు అందిస్తున్న ప్రేమ, ఆదరణతో తన తుది శ్వాస వరకు మీ సేవలో ఉంటానన్నారు. గత స్ఫూర్తితో అందరం కల్సి పని చేసి, బూత్ స్థాయి నుండే ప్రతి ఒక్కరినీ కలవాలని, ప్రతి ఇల్లు తిరగాలని సూచించారు. ప్రతి ఇంట్లో సంక్షేమం ఉంది, ప్రతి ఊళ్ళో ప్రగతి ఉన్నదని ప్రజల్లో ఉండాలి మన అభివృద్ధి సంక్షేమాన్ని తెలియజేయాలని తెలిపారు. 17న సీఎం కేసీఆర్ సిద్దిపేట ఎన్నికల శంఖారవాన్ని పూరించనున్నారన్నారు. 17 సిద్దిపేటలో సాయంత్రం సీఎం కేసీఆర్ సభ ఉంటుందని, లక్ష మందితో ' ప్రగతి - ప్రజా ఆశీర్వాద సభ' నిర్వహిస్తుమన్నారు. సిద్దిపేట నాడు ఉద్యమంలో.. నేటి అభివృద్ధిలో ఆదర్శంగా నిలిచామని చెప్పారు. సీఎం కేసీఆర్ ఆశీస్సులు, సిద్దిపేట ప్రజల ఆశీర్వాదంతో 6 సార్లు గెలిపించారని, ఆ గెలుపునకు ప్రజల ఆలోచనలను అనుగుణంగా అభివృద్ధి చేశామని.. ఈ అభివృద్ధి ఇలాగే కొనసాగాలని కోరారు. సిద్దిపేట ప్రజల కలలను సాకారం అయిన వేళ లక్ష మందితో అద్భుతమైన అపూర్వ స్వాగతం పలకాలని, అందుకోసం మండలాల వారీగా జన సమీకరణ పై సమాయత్తం కావాలని కోరారు. గత ఎన్నికల్లో మా లక్ష్యం లక్ష మెజారిటీ...



అదే స్ఫూర్తితో ఈ ఎన్నికల్లో ఔర్ ఏక్ దక్కా.. దేడ్ లాక్ పక్కా (ఎక్ లాక్ పచ్చాస్ అజార్ పక్కా) అనే నినాదంతో పని చేస్తామని నాయకులు రాధాకృష్ణ శర్మ, రాజనర్సు, రవీందర్ రెడ్డి, చిన్నా, పాల సాయి రాం, మచ్చ వేణుగోపాల్ రెడ్డి, సంపత్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, సోమిరెడ్డి, లింగం గౌడ్, ఎల్లారెడ్డి, ఎద్దు యాదగిరి, ఎర్ర యాదయ్య, శ్రీహరి గౌడ్ , ఉమా , జంగటి కనకరాజు, రాములు యాదవ్ తదితరులు మాట్లాడారు. సమన్వయం తో అందరం కల్సి ఐక్యతతో ఎన్నికల్లో అపూర్వ విజయాన్ని ఇస్తాన్నారు. 'మీరు 5 ఏండ్లు మా గురించి కష్ట పడ్డారు.. మేము ఒక హనుమాన్ దీక్ష, అయ్యప్ప దీక్షలాగా.. హరీశ్ అన్న దీక్ష చేపట్టి నేటి నుండి 50 రోజులు దీక్షలో ఉండి మీకు విజయ తిలకం దిద్దుతాం' అని చెప్పారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నెత్తురోడిన ఉగ్రవాదం

శాంతిని ప్రవచించే ప్రదేశం కోసం
నరమేధం న్యాయ సమ్మతమేనా?
అమాయకుల ప్రాణాలు
హరీ మంటున్నాయి....
ఎవరి కోపాలకో
మరెవరి రాక్షస రూపాలకో
ఉగ్రమూకల ఆగ్రహ జ్వాలల్లో
పశ్చిమాసియా (హమాస్)రక్త
మోడింది...
బతుకు చిత్రం చిద్రమయ్యింది..
ప్రపంచమా నీ ప్రయాణం ఎటు?
ప్రదేశం ఏదైనా!
ప్రాంతం ఎవరిదైనా!!
అమాయకుల ప్రాణాలు
బలి కావాల్సిందేనా?
రణ రక్కసి రాకాసి క్రీడలో
మామూలు జనం
ఆ..హా...కారాలు
ఆక్రందనలు..
బీతావహ దృశ్యాలు.. ఆర్త నాదాలు
ముష్కర మూకల దాడుల్లో
తెగిపడుతున్న అవయవాలు
మారణకాండపు
మరణ మృదంగాలు
ఇంకెన్నాళ్లు! ఇంకెన్నేళ్లు!?
గగనాన్ని సహితం
శాసించే స్థాయి కెదుగుతున్న
ఓ మానవ ప్రపంచమా
శాంతి మార్గం ఎక్కడ?
సహన సూత్రం ఏమయ్యింది?
సమరస భావం ఎక్కడుంది?
ప్రపంచ యుద్ధాలు...
ప్రచ్ఛన్న యుద్ధాలు... చవిచూసిన
ప్రపంచమా!
దేశాలని ఒకరు
సరిహద్దులని మరొకరు
ప్రాంతాలను ఇంకొకరు
ప్రదేశాలని ఇంకెందరో
రణరంగపు
రాక్షసత్వంతో ..
మంటలారని
మారణకాండపు జ్వాలలు
విశృంఖల వికటాట్ట హాసం చేస్తుంటే?
ఓ ప్రపంచమా !
భవిష్యత్తు అంతా అంధకారమయం
అడ్డుకట్ట వేస్తే
ఆనందమయం!!

- సార శ్రీనివాస్, జిన్నారం
9963893060



ఎన్నికల విధులు బాధ్యతగా చేపట్టాలి

నవతెలంగాణ-సిద్దిపేటకలెక్టరేట్



ఎన్నికల విధులను అధికారులందరు ఓ బాధ్యతగా చేపట్టి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్ సూచించారు. కలెక్టర్ కార్యాలయంలోని సమావేశం మందిరంలో జిల్లాలోని సిద్దిపేట, హుస్నాబాద్, గజ్వేల్ దుబ్బాక శాసనసభ నియోజకవర్గానికి కేటాయించిన ఎన్నికల ఎంసిసి, ఎఫ్ఎస్‌టి, ఎస్ఎస్‌టి, వీఎస్‌టీ బృందాల అధికారులకు శిక్షణా కార్యాక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. అధికారలందరూ కలిసి బృంద స్ఫూర్తితో ఎన్నికల విధులు నిర్వహించాలన్నారు. నిఘాబృందాలు అన్ని మండలాలను కవర్ చేయాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతీ ఒక్కరూ ఎన్నికల నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. తనిఖీల్లో నగదు దొరికితే సీజ్ చేసేటప్పుడు ఆ నగదు ఎందుకు తీసుకెళుతున్నారో పరిశీలించి సరైన ఆధారాలు చూపకపోతే మాత్రమే సీజ్ చేయాలన్నారు. సంభందించిన వ్యక్తులకు రిసిప్ట్ ఇవ్వాలన్నారు. సీజ్ చేసిన నగదును ట్రెజరిలో డిపాజిట్ చేయాలి లేదా హెడ్ క్వార్టర్ పోలీస్ స్టేషన్‌లో అందజేయాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో టీంలు మరింత అప్రమత్తంగా పనిచేయాలన్నారు. ఎన్నికల నిఘా బృందాలు ప్రజలతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని స్పష్టం చేశారు. లిక్కర్ మరియు ఇతర ఉచిత పంపిణీలు జరగకుండా చూడాలన్నారు. వీడియో సర్వేలెన్స్ టీం అన్ని రాజకీయ పార్టీల మీటింగ్స్‌ను వీడియో తీయాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్స్ కంట్రోల్ రూమ్ లేదా సి-విజువల్ ద్వారా వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి 15 నిముషాలలో స్పాట్‌కు వెళ్లి యాక్షన్ తీసుకోవాలన్నారు. నేటి ఉదయం 8 గంటల నుంచి అన్ని టీములు పూర్తిస్థాయిలో యాక్షన్‌లోకి రావాలన్నారు. ప్రతిరోజు టీంలు ఆర్వోకు రిపోర్ట్ పంపాలన్నారు. వారం రోజుల తర్వాత నిఘా టీంలో పనితీరును సంబంధిత ఆర్వోలు పరిశీలించాలని కోరారు. అనంతరం కమిషనర్ ఆఫ్ పోలీస్ శ్వేత మాట్లాడుతూ.. అన్ని నిఘా బృందాల పనితీరును కంట్రోల్ రూమ్ నుంచి పరిశీలిసామన్నారు. కంప్లైంట్స్ వచ్చినపుడు వెంటనే స్పందించి నిర్ణీత సమయానికి రెస్పాండ్ కావాలన్నారు. ఎన్నికల ప్రశాంతత కోసమే వ్యక్తుల బైండొవర్ చేయాలన్నారు. ప్రొసీజర్ను తు.చా తప్పకుండా పాటించి మాత్రమే బైండోవర్ చేయాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. మహిళలు ఉన్న ఇల్లుని కానీ, వస్తువులను కానీ తనిఖీ చేసేటప్పుడు మహిళా సిబ్బందితోనే చేయించాలన్నారు. ఎన్నికల సమావేశాలకు ఉదయం 6:00 నుండి రాత్రి 10 గంటల వరకు మాత్రమే అనుమతి ఉందన్నారు. మత సంబంధమైన ప్రార్ధన స్థలాల వద్ద ప్రచారాలకు అనుమతి లేదని.. నిఘా బంధాలు క్షుణ్ణంగా అబ్జర్వ్ చేయాలని స్పష్టం చేశారు. కులం, మతం పేరుతో ఓట్లు అడిగే వారిని గుర్తించి యాక్షన్ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ మరియు దుబ్బాక రిటర్నింగ్ ఆఫీసర్ గరిమా అగ్రవాల్, హుస్నాబాద్, గజ్వేల్ రిటర్నింగ్ అధికారులు బెన్ శాలెం, బన్సీలాల్, సిద్దిపేట, అడిషనల్ డీసీపీ శ్రీనివాసరావు, హుస్నాబాద్, గజ్వేల్ ఏసీపీలు కలెక్టరేట్ ఎలక్షన్ వింగ్ సూపరింటెండెంట్, డిటి తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజులది ఆత్మగౌరవ పోరాటం

- ముదిరాజులను విస్మరించిన కేసీఆర్
- ఈనెల 16న ప్రజల మధ్యనే బీఆర్ఎస్‌కు రాజీనామా... అదే రోజు 'మీ కొడుకు.. మీ ఇంటిగుమ్మంలోకి' నినాదంతో పాదయాత్ర
- ఏ పార్టీ టికెట్టు ఇచ్చిన వెళ్తా !
- ఎన్ఎంఆర్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షులు నీలం మధు ముదిరాజ్

నవతెలంగాణ-పటాన్‌చెరు



రాష్ట్రంలో 60 లక్షల జనాభా ఉన్న ముదిరాజులను సీఎం కేసీఆర్ పూర్తిగా విస్మరించారని.. తమది ఆత్మ గౌరవ పోరాటమని ఎన్ఎంఆర్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షులు నీలం మధు అన్నారు. మండలంలోని చిట్కుల్ గ్రామంలో నీలం మధు ముదిరాజ్ క్యాంపు కార్యాలయంలో ఎన్ఎంఆర్ యువసేన, అనుచరులు, సబ్బండ వర్గాల ప్రజలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. అనంతరం ముఖ్యులతో కలిసి మధు 'మీ కొడకు మీఇంటి గుమ్మంలోకి' పాదయాత్ర వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. బీసీ, సబ్బండ వర్గాలు తనను స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిపి సగర్వంగా చట్టసభల్లోకి పంపిస్తామన్నారని చెబుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో మీ ఇంటి బిడ్డగా నీలం మధు అసెంబ్లీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయబోతున్నాడు అంట నా అందరి హర్షధ్వనాల మధ్య ప్రకటించారు. ప్రతిపక్ష పార్టీల నుంచి తమ పార్టీలో చేరాలని ఫోన్లు చేస్తున్నారని.. ముదిరాజ్‌ల ఆత్మగౌరవం ముఖ్యమని టికెట్ ఖరారుచేసిన రోజునే చేరతానని చెప్పానన్నారు. నియోజకవర్గ ప్రజలు తనకు అండగా ఉన్నారని.. స్వతంత్రంగా పోటీకి ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. ఈనెల 16న ఉదయం 10 గంట లకు ఒకటో పోలింగ్ బూత్ నుంచి ప్రజా సమస్యలు తీర్చడ మే అన్ని వర్గాల మేనిఫెస్టోగా, మీ కొడుకు మీ ఇంటి గుమ్మంలో అనే నినాదంతో పాదయాత్ర చేయబోతున్నట్టు చెప్పారు. తాను16 ఏండ్లు ఏండ్లు ఉన్నప్పుడే గులాబీ జెండాతో పార్టీని బలోపేతం చేసే విధంగా ఎన్నో కార్యక్ర మాలు చేశానన్నారు. సొంత పార్టీలో ఉండి కూడా ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తనను ఎంతో ఇబ్బందికి గురి చేశారని ఆరోపించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ డబుల్ బెడ్ రూం ఇండ్లకు వస్తుంటే.. తాను ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను ఎమ్మెల్యే కుమారుడితో చింపించారన్నారు. చాకలి ఐలమ్మ విగ్రహ ఆవి ష్కరణ సమయంలో మూడుసార్లు వెళ్లినప్పటికీ.. ఎమ్మెల్యే తనను కలవలేదన్నారు. బీఆర్ఎస్ పిలిచి టికెట్ ఇస్తుందని ఆశతో ఇంత వరకూ వేచిచూశామని.. అక్కడి నుంచి ఎలాంటి పిలుపు రాకపోవడంతో.. ఇప్పుడు ఈ నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. ఏ పార్టీ అయినా టికెట్ ఇస్తానంటే ఆ కండువా కప్పుకుని అసెంబ్లీ ఎన్నికల బరిలోకి దిగను న్నట్టు చెప్పారు. ఈనెల 16న ప్రజల మధ్యనే బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి.. ప్రజల్లోకి వెళ న్నట్టు తెలిఆపరు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కొల్లూరు మల్లేష్, మహేందర్ రెడ్డి, సర్పంచులు, ఉప సర్పంచ్ లు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, ప్రజా ప్రతినిధులు, వివిధ కుల సంఘాల నాయకులు, ఎన్ఎంఆర్ యువసేన కార్యకర్తలు,ప్రజలు,తదితరులు, పాల్గొన్నారు.



పేద కుటుంబానికి అండగా వీవీఆర్ ఫౌండేషన్

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం



పేద కుటుంబాలకు, వలస కార్మిక కుటుంబాలకు వీవీఆర్ ఫౌండేషన్ అండగా నిలుస్తోందని బీఆర్‌టీయూ రాష్ట్ర నాయకుడు వి.వరప్రసాద్ రెడ్డి అన్నారు. మున్సిపల్‌లోని లక్ష్మీ నగర్‌కు చెందిన మహాలక్ష్మి గత కొన్ని రోజులుగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుందని తెలుసు కున్న బీఆర్‌టీయూ నాయకులు వి.వరప్రసాద్ రెడ్డి వి.వి.ఆర్ ఫౌండేషన్ ద్వారా బాధిత కుటుంబానికి నిత్యావసర సరుకులను అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. కష్టకాలంలో కుటుంబానికి అండగా నిలిచిన నాయకులు వరప్రసాద్ రెడ్డికి బాధిత కుటుంబ సభ్యులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు సతీష్, సురేష్, సుశీల్, మరియు చిన్న తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో ఖేడ్ అభివృద్ధి

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్



నారాయణఖేడ్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని ఎంబీఆర్ ఫౌండేషన్ చైర్మెన్ మహా రెడ్డిరోషన్ రెడ్డి, మున్సిపల్ చైర్మెన్ రుబ్బిన నజీబ్ అన్నారు. నారాయణఖేడ్ పట్టణంలోని పలు వార్డులో వారు మంగళ వారం పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ.. ప్రతీ ఇంటికి నల్లా కనెక్షన్, మిషన్ భగీరథ, రైతుబంధు, రైతుబీమా, సీసీరోడ్లు, సీసీ డ్రైన్లతో పాట కుల సంఘ భవన నిర్మాణాలు లాంటి ఎన్నో సంక్షేమ పథకానలు బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిందన్నారు. కాబట్టి వచ్చే ఎన్నికల్లో మరోమారు బీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలోకి దిగుతున్న భూపాల్‌రెడ్డినే ఆశీర్వదించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు పరమేశ్వర్, కార్యకర్తలు పాల్గొన్నారు.



దేశ ప్రజలు బీజేపీని కోరుకుంటున్నారు

నవతెలంగాణ-జోగిపేట

దేశ ప్రజలు బీజేపీని కోరుకుంటున్నారని మాజీ మంత్రి పి. బాబూ మోహన్ అన్నారు. మంగళవారం మేరా మట్టి మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా జోగిపేట పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పార్టీ కార్యర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రధాని దేశ రాజధాని ఢిల్లీలో జాతీయ యుద్ధ స్మారక సమీపంలో అమృత్ వాటికను నిర్మించబోతున్నారని , అందుకోసమే దేశ వ్యాప్తంగా మట్టిని సేకరిస్తున్నట్లు తెలిపారు. మోడీ పాలనలో సిద్ధించిన విజయాలు, సంస్కరణలు ప్రపంచానికే ఆదర్శంగా నిలవడంతో యావత్ దేశ ప్రజలు మళ్లీ మోడీనే ప్రధాని కావాలని కోరుకుంటున్నారన్నారు.రాబోవు ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అద్యక్షుడు నరేందర్‌రెడ్డి, జహీరాబాద్ పార్లమెంట్ ఇంచార్జీ, కర్నాటక ఎమ్మెల్యే అభయ్‌పటేల్, పుల్కల్, వట్‌పల్లి, టేక్మాల్ మండలాల అద్యక్షులు పండరి, అశోక్, రాజు, జిల్లా నాయకులు కొత్త శ్రీను, జగన్మాథం, పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి సుమన్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు నగేష్‌యాదవ్ పాల్గొన్నారు.



రాష్ట్ర స్థాయి కబడ్డీ సెలక్షన్‌లో కస్తూర్బా విద్యార్థి ఎంపిక

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

రాష్ట్ర స్థాయి అండర్-19 కబడ్డీ సెలక్షన్‌లో స్థానిక కస్తూర్బా గాంధీ విద్యాలయ ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థిణి భవిత ఎంపికైనట్టు పీఈటీ సుజాత తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మారుమూల ప్రాంతం నుంచి రాష్ట్రస్థాయికి కబడ్డీ సెలక్షన్‌కు ఎంపికవ్వడం అభినందనీయమన్నారు. కాగా విద్యార్థులకు మరింత ప్రోత్సాహించి ముందుకు తీసుకెళ్తానన్నారు.



సబిత విభిన్న ప్రతిభావంతుల పాఠశాలలో న్యాయ అవగాహనా సదస్సు

నవతెలంగాణ-సంగారెడ్డి

జాతీయ న్యాయ సేవ అధికార సంస్థ రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ హైదరాబాద్ వారి ఆదేశాలతో జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ చైర్మెన్ ఇంచార్జ్ జిల్లా న్యాయమూర్తి సుదర్శన్ సూచనలతో న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి హనుమంతరావు మంగళవారం సబితా విభిన్న ప్రతిభావంతుల పాఠశాలలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లలు క్రమశిక్షణతో ఉండాలని.. బాగా చదువుకోవాలని, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రాథమిక విధులు హక్కులు తెలిసి ఉండాలన్నారు. విద్యార్థిణులు గృహహింస వరకట్న నిషేధ చట్టం, బాల కార్మిక వ్యతిరేక చట్టం మరియు పోక్సో చట్టం గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఏది చెడు స్నేహం, ఏది మంచి స్నేహం అనేది గుర్తించి ముందుకు వెళ్లాలన్నారు. ఈ సదస్సు నందు సబితా విభిన్న ప్రతిభావంతులు (మానసిక దివ్యాంగుల) పాఠశాల సంగారెడ్డి ప్రిన్సిపాల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సైదాపూర్ పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈఓ

నవతెలంగాణ-కొండాపూర్

మండల పరిధిలోని సైదాపూర్ పాఠశాలను మండల విద్యాధికారి(ఎంఈఓ) భీంసింగ్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులు రాస్తున్న పరీక్షలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు అందిస్తున్న రాగి మాల్ట్‌ను పరిశీలించి విద్యార్థులతో సహ ఉపాధ్యాయులతో కలిసి సేవించారు. ఉపాధ్యాయులకు నిర్ధిత సమయంలో F1, F2 మార్కులను అప్‌లోడ్ చేసి.. సంబంధించిన ప్రొఫార్మాలను తమ వద్ద సిద్దంగా ఉంచుకోవాలని సూచించారు. సీజ్ పరీక్షలపైన విద్యార్థులను సంసిద్ధత చేయాలన్నారు.

జోగిపేట ఎస్సైగా అరుణ్ కుమార్



నవతెలంగాణ-జోగిపేట

జోగిపేట నూతన ఎస్ఐగా అరుణ్ కుమార్ మంగళవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. వికారాబాద్ జిల్లా మర్పల్లిలో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న అరుణ్ కుమార్ బదిలీపై జోగిపేటకు వచ్చారు. ఇక్కడ ఎస్సైగా పనిచేస్తున్న గైపప్ప అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు.

నేతల సస్పెన్షన్ ఎత్తివేత

నవతెలంగాణ-జిన్నారం

మండల కేంద్రమైన జిన్నారానికి చెందిన సంగారెడ్డి జిల్లా బీజేపీ మాజీ ప్రధాన కార్యదర్శి వంగేటి ప్రతాపరెడ్డి, జిన్నారం మండలానికి చెందిన మరో సీనియర్ బీజేపీ రైతు నేత అండూర్ కుర్బల్ నర్సింగరావులపై గల సస్పెన్షన్‌ను బీజేపీ రాష్ట్ర కమిటీ ఎత్తివేసింది. సదరు నాయకుల అభ్యర్థన మేరకు బీజేపీ తెలంగాణ రాష్ట్ర శాఖ ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్ రెడ్డి ప్రత్యేకంగా ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీ బలోపేతానికి విస్తృతంగా కృషి చేయాలని సదరు నాయకులకు సంబంధించి జారీ చేసిన ఉత్తర్వుల్లో సూచించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకత్వానికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్నికల నిబంధనలకు లోబడి పనిచేయాలి



నవతెలంగాణ-సంగారెడ్డి

ఎన్నికల షెడ్యూల్ రాగానే ప్రవర్తన నియమావళి అమల్లోకి వచ్చిందని.. అందరూ ఎన్నికల నియమ నిబంధనలకు లోబడి పని చేయాల్సి ఉంటుందని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో కిరాణా, కూరగాయలు, స్టేషనరీ, టెంట్ హౌస్, క్యాటరింగ్, లైటింగ్, సౌండ్ సిస్టం, ఫ్లెక్సీ తయారీ మరియు ప్రింటింగ్ ప్రెస్, ట్రావెలింగ్ ఏజెన్సీల యజమానులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొలిటికల్ పార్టీలు నిర్వహించే పలు కార్యక్రమాలకు సంబంధించి దుకాణం నుండి ఏది బయటకు వెళ్లినా బిల్ తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. నగదు పై నియంత్రణ ఉందని రూ.50 వేలకు మించితే తప్పనిసరిగా ఆ డబ్బుకు సంబంధించిన రసీదు ఉండాలన్నారు. ప్రచార కర పత్రాలు, పోస్టర్లు, ఫ్లెక్సీలు ప్రింట్ చేసినప్పుడు వాటిపై ఫర్మ్ పేరు, ప్రింటర్ పేరు, ఫోన్ నెంబర్ ఉండాలని స్పష్టం చేశారు. ప్రింటింగ్‌కు సంబంధించిన పూర్తి వివరాలతో రిజిస్టర్లు నిర్వహించాలని సూచించారు. రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రచారంలో భాగంగా వినియోగించే వస్తువులకు రేట్ కార్డు నిర్ణయించాల్సి ఉందన్నారు. ఆయా వస్తువుల రేట్లను నిర్ణయించడానికి రీజనబుల్ రేట్లు అందజేయాలని కోరారు. ఆయా షాపుల లెటర్ హెడ్ పై ఆయా రేట్లు వ్రాసి సంతకం చేసి నిన్నటి(మంగళవారం) సాయంత్రంలోగా సంగారెడ్డి మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ అశోక్, డిఆర్ఓ నగేష్, కార్మిక శాఖ సహాయ కమిషనర్, మున్సిపల్ కమిషనర్ సుజాత,జిల్లా తూనికలు కొలతల అధికారి,ఎన్నికల విభాగపు సూపరింటెంట్ దశరథ్, వివిధ షాపుల యజమానులు తదితరులు పాల్గొన్నారు.

ఆదరించండి.. అభివృద్ధి చేసి చూపిస్తా



నవతెలంగాణ-జహీరాబాద్

వచ్చే ఎన్నికల్లో తనను ఆదరిస్తే అభివృద్ధి చేసి చూపిస్తా అని మాజీ మంత్రి డాక్టర్ ఏ.చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని సత్వార్ గ్రామంలో మంగళవారం పర్యటించి దర్గాలో ప్రార్థనలు చేశారు. హనుమాన్ మందిర్‌లో పూజలు చేసారు. అనంతరం గ్రామస్తులు నిర్వహించిన సమావేశంలో పలువురు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరగా.. వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెదోడికి ఇండ్లు ఇవ్వకుండా.. భూస్వాములకు, పెత్తందారులకు డబుల్ బెడ్‌రూం ఇండ్లు కేటాయించడం సిగ్గుచేటన్నారు. గ్రామీణ స్థాయిలో ఉన్న నిరుపేదలకు కనీసం ఇల్లు నిర్మించుకు నేందుకు రుణాలు కూడా మంజూరు చేయకపోవడం ఎంతవరకు సమంజసమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే.. అధిష్టానం ప్రకటించిన ఆరు సూత్రాలను అమలు పరుస్తామన్నారు. తదనంతరం ఎంపీపీ గిరిధర్ రెడ్డి మాట్లాడుతూ.. ఇప్పటికే చిరాకుపల్లి, సత్వార్ గ్రామాల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టినట్టు తెలిపారు. ఈ సమావేశం లో మాజీ సర్పంచ్ చంద్రశేఖర్ రెడ్డి, నర్సింలు, రాజు, రాములు , ఇబ్రహీం, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల సమ్మె తాత్కాలిక వాయిదా



నవతెలంగాణ-జహీరాబాద్

గత 15 రోజులుగా ఆశా వర్కర్లు సమ్మె చేస్తున్నా.. ప్రభుత్వం స్పందించకపోవడంతో మంగళవారం ఛలో హైదరాబాద్ పేరుతో కోఠిలోని కమీషనర్ ఆఫీస్ ఎదుట వేలాది మందితో ధర్నా చేపట్టారు. దీంతో హెల్త్ డైరెక్టర్ శ్రీనివాసరావు ఆశా యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర కమిటీతో చర్చలు జరిపి.. కొన్ని హామీలు ఇవ్వడంతో ఆశా వర్కర్లు తాత్కాలికంగా సమ్మెను విరమించారు. ఈవిషయంపై జహీరాబాద్ క్లస్టర్ అధికారి కార్యాలయంలో సమ్మె విరమణ లెటర్ అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మహిపాల్ మాట్లాడుతూ.. ఛలో హైదరాబాద్ చర్చల్లో డైరెక్టర్ స్పందిస్తూ.. ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం ముగ్గురు ఐఏఎస్ అధికారులతో కమిటీని వేస్తామని.. ఆ కమిటీలో తాను కూడా ఒక మెంబర్‌గా ఉంటానని డైరెక్టర్ తెలియజేశారన్నారు. ఈ కమిటీ ఆశాల డిమాండ్‌లన్నింటినీ పరిగణలోకి తీసుకుంటుందని.. అలాగే యూనియన్ ప్రతినిధులతో ముఖాముఖి చర్చలు కూడా జరుపుతామన్నారు. అన్ని అంశాలు అధ్య యనం చేసి ప్రభుత్వానికి ఆశా వర్కర్ల సమస్యలపైన నివేది కను అందజేస్తామని చెప్పారన్నారు. వాటితోపాటు పెండింగ్ పిఆర్సి ఎరియర్స్, కరోనా రిస్క్ అలవెన్స్ ఇచ్చే విధంగా చూస్తామని, సమ్మె కాలం వేతనాలు చెల్లిస్తామని, ఇతర పెండింగ్ బిల్లులు కూడా చెల్లిస్తామని తదితర హామీలు ఇచ్చారన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన సందర్భంగా ఈ హామీ ప్రకారం సమ్మెను విరమించాలని కోరగా.. సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. కాగా ఆ కమిటీ ఆశాల సమస్యల పైన అధ్యయనం చేసి.. ఆశా వర్కర్లకు అనుకూలంగా ప్రభుత్వానికి నివేదిక పంపు తుందని ఆశిస్తున్నామన్నారు.కార్యక్రమంలో యూనియన్ యూనియన్ నాయకులు కవిత, అన్నమ్మ, లక్ష్మీ, నిర్మల పాల్గొన్నారు.

అర్హులకే ఇండ్ల పట్టాలు అందేలా చర్యలు



నవతెలంగాణ-న్యాల్‌కల్

పేదలకు అందాల్సిన ఇండ్ల పట్టాల విషయంలో అవకతవకలు జరిగాయని మిర్జాపూర్(బి) గ్రామస్తులు సర్పంచ్‌తో కలిసి తాసిల్దార్, రెవెన్యూ అధికారులకు సోమవారం ఫిర్యాదు చేసిన విషయం విధితమే. కాగా ఈ ఫిర్యాదుకు వెంటనే స్పందించి తహసీల్దార్ రాజిరెడ్డి మంగళవారం రోజున మిర్జాపూర్(బి) గ్రామాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్, గ్రామస్తులు తహసీల్దార్ ఎదుట స్థలాల విషయంలో తమ గోడును వినిపించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ.. అర్హులైన నిరుపేదలకు ఇళ్లస్థలాలు వచ్చేలా చర్యలు తీసుకుంటానన్నారు. వారం రోజుల్లో గ్రామంలో దరఖాస్తుదారుడి ఇంటికి వెళ్లి పరిశీలించి అర్హులను గుర్తిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మిర్జాపూర్ (బి) గ్రామ సర్పంచ్ నిర్మలా జగన్నాథ్ రెడ్డి, పంచాయతీ సభ్యులు గ్రామస్తులు ఉన్నారు.

చేరువైన ఓఆర్ఆర్ ఎంట్రెన్స్

- శంబిపూర్ వద్ద రూ.45 కోట్లతో ఇంటర్‌చేంజ్ ఏర్పాటు
- జిన్నారం పరిశ్రమ వర్గాలకు, ప్రజలకు, వ్యాపారులకు మరింత సౌకర్యం

నవతెలంగాణ-జిన్నారం

హైదరాబాద్ ఓఆర్ఆర్‌కు సంబంధించి సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం కాజిపల్లి,బొల్లారం, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా శంబిపూర్ మల్లంపేట్ వద్ద మరో ఇంటర్‌చేంజ్ ఏర్పాటయ్యింది. రూ.45 కోట్ల నిధులతో హెచ్ఎండిఏ ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ ఇంటర్ చేంజ్ సౌకర్యంతో ఆయా ప్రాంతాలకు సంబంధించి రాకపోకల విషయంలో దూరభారం, రుసుం, సమయం ఆదా కానున్నదని స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. జిన్నారం మండల పరిధిలో విస్తృతంగా పరిశ్రమలు విస్తరించడం, పరిశ్రమల వర్గాలే కాకుండా వ్యాపార వర్గాలు, సాధారణ జనం వివిధ అవసరాలతో ఔటర్ రింగ్ రోడ్డును ఆశ్రయిస్తూ ఉంటారు. ఈ నేపథ్యంలో గతంలో దుండిగల్, సుల్తాన్పూర్ కూడళ్ల మీదుగానే రాకపోకలు సాగించే పరిస్థితి ఉండేది. కాగా ప్రస్తుతం శంబిపూర్ వద్ద జిన్నారం మండలం బొల్లారం కాజిపల్లి సమీపంగా ప్రస్తుతం ఏర్పాటైన ఇంటర్ చేంజ్‌తో ఈ దూరభారం తగ్గనున్నది.



12 దాటినా.. పత్తా లేరు

- ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ప్రజల పడిగాపులు
- పట్టించుకోని అధికారులు



నవతెలంగాణ-పుల్కల్

పుల్కల్ ఉమ్మడి మండలంలో ఉన్న ఎంపీడీవో కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న అధికారులు సమయ పాలన పాటించకుండా.. ఇష్టం వచ్చినప్పుడు వస్తు న్నారు. దీంతో దూర ప్రాంతాల నుంచి వ్యయప్రయాసలకు ఓర్చి కార్యాలయానికి వచ్చిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారుల రాకకోసం గంటల తరబడి కార్యాలయం ఎదుట పడిగాపులు కాస్తున్నారు. 10 గంటలకు రావాల్సిన అధికారులు 12 గంటలు దాటిన తర్వాత రావడం.. వచ్చిన గంటకే భోజన విరామం అంటూ గంట సమయాన్ని వృథా చేస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. ఆ తర్వాత అధికారి దగ్గరకు వెళ్తే.. సమయం నాలుగు అవు తుందని ఈరోజు మీ పని కాదు రేపు రండి అని సమాధానం చెప్పన్నారని వాపోతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అర్ధాకలితో అలమటించినప్పటికీ వచ్చిన పనికాకపోవడంతో ప్రజలు నిరాశతో వెనుతిరుగుతున్నారు. అంతేకాకుండా కొందరు అధికారులు 'మీ పని చేయను.. ఏం చేస్తారో చేసుకోండి' అంటూఇష్టారీతిగా మాట్లాడుతున్నారని ప్రజ లు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పం దించి.. సదరు ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఇదే విషయమై పుల్కల్ ఎంపీడీవో జయశ్రీని వివరణ కోరగా.. తాను ఇటీవలే ఇక్కడికి కొత్తగా వచ్చానని.. ఎవరు ఎప్పుడు వస్తున్నారు, ఎప్పుడు పోతున్నారో అనే దానిపై ఇక నుండి ప్రత్యేక శ్రద్ధ వహిస్తానన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే.. ఎంతటివారైనా ఉపేక్షించేది లేదన్నారు. ఈ మండలానికి కొత్తగా రావడంతో కొద్దిగా లోటుపాట్లు జరగవచ్చని.. ఇకనుండి అలాకాకుండా.. ప్రతీ అధికారి సమయపాలన పాటించేలా తగు చర్యలు తీసుకుంటామన్నారు.



నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



నవతెలంగాణ-నారాయణఖేడ్ రూరల్

రాజకీయ పార్టీలు నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు చేపడతామని ఆర్డీవో వెంకటేష్ హెచ్చరించారు. ఎన్నికల అధికారి ఆర్‌డీఓ ఆఫీస్‌లో రాజకీయ పార్టీలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల షెడ్యూల్ విడుదలైనందున రాజకీయ పార్టీలు సహకరించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా పనిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.ఫ్లెక్సీలు, పోస్టర్లు బహిరంగ ప్రదేశాల్లో ఉంటే తీసేయాలన్నారు. రాజకీయ పార్టీలు సభలు సమావేశాలు పెట్టుకుంటే పర్మిషన్ తీసుకోవాలన్నారు. మైక్, స్థలం, వెహికల్ అనుమతి తీసుకోవాలన్నారు. మతం పేరుతో రాజకీయాలు చేయొద్దన్నారు. రాజకీయ పార్టీ జెండాలు కానీ పోస్టల్ కానీ గోడలపై ఇంటిపై పెట్టాలంటే ఆ ఇంటి యజమాని అనుమతి తప్పని సరి అన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ వెంకట్ రెడ్డి, సీఐలు, తహసీల్దార్, వివిధ రాజకీయ పార్టీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

గీతంలో ఘనంగా ఉత్తమ తయారీ దినోత్సవం

- ముఖ్య అతిథిగా పాల్గొన్న అరబిందో ఉపాధ్యక్షుడు డాక్టర్ సత్యేంద్రనాథ్



నవతెలంగాణ-పటాన్‌చెరు

గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ హైదరాబాద్‌లో మంగళవారం జాతీయ 'ఉత్తమ తయారీ విధాన' (జీఎంపీ) దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అరబిందో ఫార్మా అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ (కార్పొరేట్ క్వాలిటీ) డాక్టర్ సీ.వీ. సత్యేంద్రనాథ్ ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని 'ఉత్తమ డాక్యుమెంటేషన్ ప్రాక్టీస్' (జీఎంపీ) ప్రాముఖ్యతపై అతిథ్య ఉపన్యాసం ఇచ్చారు. జీఎంపీ నాణ్యత హామీలో అంతర్భాగమైనదని, మంచి తయారీ అలవాట్లతో ముడిపడి ఉందన్నారు. పత్రాల తయారీ, సమీక్షించ డం, ఆమోదించడం, జారీచేయడం, రికార్డింగ్, నిల్వ చేయడం వంటి క్రమబద్ధమైన ప్రక్రియలన్నీ ఉత్తమ డాక్యుమెంటేషన్ ప్రాక్టీస్ లో భాగంగా ఆయన అభివర్ణించారు. తయారీ పద్ధతుల ప్రాముఖ్యతను వివరిస్తూ, ఔషధాలను స్థిరంగా ఉత్పత్తి చేయడంతో పాటు వినియోగానికి తగిన నాణ్యతా ప్రమాణాలతో, ఉత్పత్తి మార్గదర్శకాలకు అనుగుణంగా నియంత్రిస్తాయని డాక్టర్ సత్యేంద్రనాథ్ చెప్పారు. ఔషధాల తయారీలో నాణ్యత నిర్వహణ, సిబ్బంది అర్హత, పరిశుభ్రత, డాక్యుమెంటేషన్, రికార్డులు, పదార్థాల నిర్వహణ, ఉత్పత్తి, ప్యాకేజింగ్ వంటి అంశాల ప్రాధాన్యాన్ని కూడా వివరిం చారు. గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జీ.ఎస్.కుమార్ అతిథిని స్వాగతించి సత్కరించగా, కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ హైమ పొన్నగంటి వందన సమర్పణ చేశారు.

ఎస్ఎస్‌డీ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి



నవతెలంగాణ-హత్నూర

ఈనెల 15న హైదరాబాద్‌లోని ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్ (శాంతి చక్ర ఇంటర్ నేషనల్) సైఫాబాద్‌లో జరిగే ఆల్ ఇండియా సమతా సైనిక్ దళ్ రాష్ట్ర పదో మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సాయమొ ల్ల నర్సింగ్ రాజ్ కోరారు. దౌల్తాబాద్‌లో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మహాసభల కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో కులం, మతం, జాతి, ప్రాంతం, వర్గ, వర్ణ, లింగ, వివ క్ష లేని సామాజిక సాంస్కృతిక స్వచ్ఛంద సంస్థ ఆల్ ఇండియా సమతా సైనిక్ దళ్ అని అన్నారు. ఎలాంటి రాజకీయ సంబంధాలు లేని ఈ సంస్థ ఆధ్వర్యంలో దేశంలో గత 96 ఏళ్లుగా సామాజిక సేవలు అందిస్తూ ఎంతో మందిని సుశిక్షితులుగా తయారు చేశామన్నారు. ఇప్పటికీ దేశంలో ఉన్న అసమానతలు, అణచివేతలు, వివక్ష రూపాలు, నిరుద్యోగం, దారిద్ర్యం తాండవిస్తోందన్నారు. ఇటువంటి వాటిని రూపు మాపెందుకు ఎస్ఎస్‌డీ కృషిచేస్తున్నదన్నారు. ఈ నేపథ్యంలో సంఘం బలోపేతం కోసం నిర్వహిస్తున్న ఈ మహాసభలను జయప్రదం చేయాలని ఉపాధ్యాయ, ఉద్యోగ, మేధావి, మహిళా, యువజన, విద్యార్థి వర్గాలను కోరారు. ఈ సమావేశంలో ఆ సంస్థ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.కృష్ణ, జిల్లా అద్యక్షులు ఎం. బాల్ రాజ్, మాజీ స్టేట్ ఎక్జిక్యూటివ్ మెంబర్ మీనంపల్లి కిషన్ రావు, మండల కన్వీనర్ దానన్నోల్ల శ్రీనివాస్, సంగారెడ్డి మండల కన్వీనర్ జే.రాంసింగ్ నాయక్, బ్యాగరి గోపాల్ తదితరులు ఉన్నారు.

రైతులకు అందుబాటులో శనిగె విత్తనాలు



నవతెలంగాణ-గుమ్మడిదల

యాసంగి 2023-24కు సంబంధించి మండల వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘంలో రైతుల కోసం 250 శెనిగ బస్తాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి డి.శ్రీనివాసరావు తెలిపారు. మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీల్లో శనిగె పంట సాగు చేస్తున్న రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అవసరం ఉన్న రైతులు పట్టేదారు పాస్ పుస్తకం జిరాక్స్, ఆధార్, తీసుకువచ్చి వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రం నుంచి శనగ విత్తనాలను తీసుకువెళ్లాలన్నారు. 25 కిలోలు బస్తాకు రూ.1875గా ప్రభుత్వం ధరను నిర్ణయించిందన్నారు.

మునిపల్లి : మండలంలోని రైతులకు రబీ సీజన్‌గాను పంటసాగుకోసం పెద్దచెల్మెడ పీఏసీఎస్ కార్యాలయంలో 200క్వింటాళ్ల శెనిగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని పీఏసీఎస్ చైర్మెన్ పద్మదుర్గయ్య, ఏవో శివకుమార్, సొసైటీ కార్యదర్శి శివకుమార్ రెడ్డిలు తెలిపారు. ఈ సందర్భంగా విత్తనాలు కావాల్సిన రైతులు తమ పట్టా పాసు పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీ వెంట తీసుకురావాలని సూచించారు. వివరాలకు చైర్మెన్ పద్మదుర్గయ్య 9440709111, సొసైటీ కార్యదర్శి శివకుమార్ రెడ్డి 9849663890 గల నెంబర్లను సంప్రదించాలన్నారు.

ఎన్నికల కోడ్‌తో అన్ని పార్టీలో ఉత్కంఠత

- బీఆర్ఎస్ పార్టీ నాయకుల్లో అంతర్మథనం
- ఉద్యమకారులలో పెరుగుతున్న మనస్తాపం
- పార్టీ మార్పులపై కొందరిలో జరుగుతున్న చర్చలు

నవతెలంగాణ-తూప్రాన్ రూరల్/మనోహరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో కేంద్ర ఎన్నికల కమిటీ ఎన్నికల నిర్వహణకై పచ్చ జెండా ఊపింది. దాంతో తెలంగాణ రాష్ట్రంలో రాజకీయ నాయకుల మధ్య ఉత్కంఠ పరిస్థితులు నెలకొంటున్నాయి. ఒకవైపు గజ్వేల్ నియోజకవర్గంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక స్థానంలో ఉండడంతో అటు కాంగ్రెస్, బీజేపీలు అభ్యర్థుల వేటలో ఉన్నాయి. కాంగ్రెస్ పార్టీ నుంచి ఇదివరకే మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డిని ఖరారు చేస్తున్నట్టు వార్తలు వినిపిస్తున్నప్పటికీ బీజేపీ పార్టీలో ముఖ్యమైన నాయకత్వం లేని పరిస్థితి నెలకొంది. బీజేపీకి కనీసం అభ్యర్థులు లేని పరిస్థితి నెలకొనడంతో అటు కాంగ్రెస్ బీఆర్ఎస్ మధ్య పోటీ నెలకొంటుందన్నట్టు ప్రజల్లో ఊహాగానాలు వస్తున్నాయి. ఇప్పటికే ముఖ్యమంత్రి కేసీఆర్ గజ్వేల్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నట్టు ప్రకటించినప్పటికీ కాంగ్రెస్ పార్టీ నుంచి అభ్యర్థులను ప్రకటించినప్పటికీ అటు మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డితోపాటు పార్టీ సీనియర్ నాయకులు మందాడి జస్వంత్ రెడ్డి కూడా తనకే ఎమ్మెల్యే టికెట్ కేటాయిస్తుందని ఇప్పటికే నియోజకవర్గంలోని పలు పలువురి జస్వంత్ రెడ్డికి విశ్వాసంగా ఉండే నాయకులకు ఫోన్లు చేసి మరి తనకు మద్దతు తెలిపాలంటూ చెపుతున్నట్టు కొందరి నుంచి తెలుస్తుంది. అలాగే తనకే కాంగ్రెస్ నుంచి టికెట్ వస్తుందని ఆశతో మాజీ ఎమ్మెల్యే తోముకుంట నర్సారెడ్డి పార్టీ కార్యక్రమాలతో మేనిఫెస్టోను వివరిస్తూ ప్రజలలో తిరుగుతూ కార్యక్రమాలను చేపడుతున్నారు. అయినప్పటికీ ఇరుపాటిల్లో అభ్యర్థుల ఎంపికలో అయోమయ పరిస్థితి నెలకొనడంతో బీఆర్ఎస్ పార్టీకి కలిసివచ్చే పరిస్థితి నెలకొంది. రాష్ట్ర ముఖ్యమంత్రి వచ్చేనెల 9న గజ్వేల్‌లో నామినేషన్ దాఖలు చేయనున్నట్టు ప్రకటించినప్పటికీ ఇరు పార్టీలు కనీసం అభ్యర్థుల పెరగటంలో కూడా ముందుండలేని పరిస్థితి నెలకొంది. ఏదిఏమైనా బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ గజ్వేల్ నుంచి పోటీ చేస్తుండడంతో ప్రజలలో ఆయన చేసిన సంక్షేమ పథకాలు రైతు బీమా ఆసరా పెన్షన్లు కళ్యాణ్ లక్ష్మి షాదీ ముబారక్ రైతు బీమా లాంటి అనేక సంక్షేమ పథకాలు బీఆర్ఎస్ ప్రభుత్వానికి కలిసి వచ్చే పరిస్థితి నెలకొంది.

రేగోడు తహసిల్దార్‌గా బాధ్యతలను స్వీకరించిన మల్లయ్య



నవతెలంగాణ-రేగోడు

రేగోడు తహసిల్దార్‌గా మల్లయ్య తహసిల్దార్ కార్యాలయంలో మంగళవారం బాధ్యతలను స్వీకరించారు. ఇదివరకు రేగోడు మండల తహసిల్దారుగా విధులు నిర్వహించిన కృష్ణ టేక్మాల్ మండలానికి బదిలీపై వెళ్లారు. నూతనంగా బాధ్యతలను స్వీకరించిన తహసిల్దార్ మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలపై వచ్చిన ప్రజలకు అందుబాటులో ఉండి పనిచేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో గిర్ధావర్ ఫెరోజ్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి



నవతెలంగాణ-పాపన్నపేట

మండల పరిధిలో మల్లంపేట, కందిపల్లీ గ్రామాలలో ఇటీవల మృతి చెందిన కుటుంబాలను మంగళవారం మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి పరామర్శించారు. కందిపల్లి గ్రామంలో పాము కాటుకు గురై మరణించిన శంకర్ మానయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదే విధంగా మల్లంపేట గ్రామంలో అనారోగ్యంతో బాధ పడుతున్న వారిని, మృతుల కుటుంబాలను ఓదార్చి పరామర్శించారు. ఆమె వెంట మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి, ఏడుపాయల చైర్మన్ బాలా గౌడ్, సర్పంచులు గురుమూర్తి గౌడ్, జగన్, ఏడుపాయల మాజీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, గ్రామ నాయకులు, సత్యనారాయణ, విటల్, యాదయ్య, నాగభూషణం గౌడ్ పాల్గొన్నారు.

టేక్మాల్ తహసీల్దార్‌గా కృష్ణ



నవతెలంగాణ-టేక్మాల్

టేక్మాల్ నూతన తహసీల్దార్‌గా కృష్ణ మంగళవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇంతకుముందు ఆయన రేగోడు తహసీల్దార్‌గా బాధ్యతలు నిర్వహించేవారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ మల్లయ్యను రేగోట్ తహసీల్దారుగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. బాధ్యతలు తీసుకున్న కృష్ణ విలేకరులతో మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి ఎలాంటి కష్టాలు లేకుండా బాధ్యతలు నిర్వహిస్తామని చెప్పారు. ప్రజలకు సేవ చేసే భాగ్యం ప్రభుత్వ ఉద్యోగులకు ఉందన్నారు. కార్యాలయ సిబ్బందితో మాట్లాడుతూ సకాలంలో కార్యాలయానికి హాజరుకావాలని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలిగించకుండా విధులు నిర్వహించాలని సూచించారు.

కల్వకుంటలో నాయి బ్రాహ్మణ ఎన్నికలు



నవతెలంగాణ - నిజాంపేట

మండల పరిధిలోని కల్వకుంట గ్రామంలో నాయి బ్రాహ్మణ నూతన కార్యవర్గం ఎన్నికలు ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షుడు ముత్యాల రమేష్ ,ఉపాధ్యక్షుడు లక్ష్మీనరసింహ, కార్యదర్శి స్వామి, రాము, సలహాదారు యాదగిరి, సంఘం సభ్యులు శంకర్, బల్దాస్, పరిసరాములు, యాదగిరి, శ్రీకాంత్, స్వామి, బాలకృష్ణ ,శివకృష్ణ , లక్ష్మణ్. అధ్యక్షుడు మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి నన్ను అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు సభ్యులందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. సంఘం అభివృద్ధి కోసం ఎల్లవేళలా కృషి చేస్తానన్నారు.

పోలింగ్ కేంద్రాలలో పూర్తి వసతుల కల్పనకు చర్యలు

- తహసీల్దార్ గ్రేసీ బాయ్





నవతెలంగాణ-పెద్ద శంకరంపేట్

పెద్ద శంకరంపేట మండల పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ సిబ్బందికి. ఓటర్లకు కావలసిన అన్ని వసతులను కల్పించడానికి చర్యలు తీసుకుంటామని పెద్ద శంకరంపేట తహసీల్దార్ గ్రేస్ బాయ్ అన్నారు. మంగళవారం పెద్ద శంకరంపేట మండల పరిధిలోని కొలపల్లి మూసాపేట్ మక్త లక్ష్మాపూర్ బూరుగుపల్లి దానం పల్లి జూకల్ తదితర గ్రామాల్లోని పోలింగ్ బూత్ కేంద్రాలను ఆమె సందర్శించి పరిశీలించారు. ఎన్నికల నిర్వహణ సమయంలో పోలింగ్ సిబ్బందికి ఇతరులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు ఎలా ఉన్నాయని పరిశీలిస్తున్నామన్నారు. ఎక్కడైనా చిన్న చిన్న సమస్యలు ఉంటే వాటిని పరిష్కరిస్తామన్నారు. ఎవరికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శరణప్ప పంచాయతీ కార్యదర్శులు బిఎల్వోలు తదితరులు ఉన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన డిప్యూటీ తహసీల్దార్



నవతెలంగాణ-నార్సింగి

రాష్ట్రంలో 30 నవంబర్‌న జరగబోయే సార్వత్రిక ఎన్నికల కోసం జాతీయ ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసిన సందర్భంగా ఎన్నికలు సజావుగా జరపడానికి అధికారులు పోలింగ్ కేంద్రాల పరిశీలనలు మొదలుపెట్టారు. మండల పరిధిలోని శేరిపల్లి గ్రామంలో మండల డిప్యూటీ తహసీల్దార్ కౌశిక, ఆర్ఐ నవీన్ రావుతో పాటు పర్యటించి గ్రామంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాల లోని రెండు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రంలో విద్యుత్ ఏర్పాట్లను, మరుగుదొడ్ల ను పరిశీలించగా మరుగుదొడ్లు నిర్మాణ దశలో ఉన్నందున, ఎన్నికల తేది లోపు నిర్మాణం పూర్తి చేయాలని గ్రామ కార్యదర్శి నాగరాజుకు సూచించారు. వృద్ధ ఓటర్లకు వీల్‌చైర్లు అందుబాటులో ఉన్న పోలింగ్ కేంద్రాలను ఎంపిక చేశామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయితీ కార్యదర్శి నాగరాజు, అంగన్వాడి టీచర్ మల్లమ్మ, గ్రామస్తులు నెరెళ్ళ రవి, అరుణ్ యాదవ్, గజవల్లి భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదల గుడిసెలను కూల్చేసిండ్రు

- రియల్ ఎస్టేట్ వ్యాపారులతో కుమ్మక్కై మున్సిపల్ అధికారులు
- న్యాయం చేయకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తాం
- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కె. మల్లేశం





నవతెలంగాణ-మెదక్

రియల్ ఎస్టేట్ వ్యాపారులతో కుమ్మక్కైన మున్సిపల్ అధికారులు పేదల గుడిసెలను కూల్చేస్తుండ్రని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కె. మల్లేశం పేర్కొన్నారు. మంగళవారం మెదక్ పట్టణంలోని హమాలీ కాలనీలో అధికారులు కూల్చివేసిన నిరుపేదల గుడిసెలను సందర్శించారు. అనంతరం మెదక్ మున్సిపల్ కార్యాలయానికి తరలివెళ్లి కమిషనర్‌ను నిలదీశారు. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడుతూ 1992లో అసైన్మెంట్ కమిటీ ద్వారా హమాలీ కార్మికులకు, పేదలకు 5 ఎకరాల 30 గుంటల భూమిని అప్పటి ప్రభుత్వం కేటాయించిందన్నారు. 114 మంది పేదలకు ప్లానింగ్ చేసి పట్టాలు పంపిణీ చేశారన్నారు. పట్టాలు ఇచ్చినవారికి పొజిషన్ చూపకుండా ఇప్పటి వరకు ప్రభుత్వ అధికారులు కాలయాపన చేశారన్నారు. పట్టాదారులు వ్యవసాయ కార్మిక సంఘం సహకారంతో పట్టాలు ఉన్నవారు గుడిసెలు వేసుకొని స్థానికంగా నివాసం ఉంటున్న పేదలపై రియల్ ఎస్టేట్ వ్యాపారులు కన్నేసినట్లు తెలిపారు. పేదలు వేసుకున్న గుడిసెలను కూల్చి వేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకులకు ఎన్నికలపై ఉన్న దృష్టి పేదలపై లేదన్నారు. మున్సిపల్ అధికారులు రియల్ ఎస్టేట్ వ్యాపారులతో కుమ్మక్కై ప్రభుత్వ భూమిని అమ్మడానికి ప్రయత్నించి పేదల గుడిసెలపై దాడి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రెవెన్యూ మున్సిపల్ అధికారులు 248/1 సర్వే నెంబర్లు నివాసం ఉంటున్న పేదలకు రక్షణ కల్పించి పట్టా లేనివారికి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు నాగమణి, జిల్లా నాయకులు గుడిసెల పోరాట కమిటీ కన్వీనర్ లచ్చా గౌడ్, గీత, అంజమ్మ, పాషా భాయ్, జ్యోతి, సిద్దమ్మ, రామమ్మ, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

పాతికేళ్ల కుర్రాడు రాజకీయాల్లో పోటీ చేయకూడదా

- కేటీఆర్, కవిత ఏం అనుభవంతో బరిలో నిలిచారు
- రాజకీయ అజ్ఞాని మామిళ్ల ఆంజనేయులు
- కాంగ్రెస్‌ను విమర్శిస్తే ఊరుకునేది లేదు
- ఆగ్రహం వ్యక్తం చేసిన కాంగ్రెస్ నేతలు



నవతెలంగాణ-మెదక్

పాతికేళ్ల కుర్రాడు రాజకీయాల్లో పోటీ చేయకూడదా, కేటీఆర్, కవితలు ఏం అనుభవంతో తొలిసారి ఎన్నికల బరిలో నిలిచారని కాంగ్రెస్ నేతలు కొండన్ సురేందర్ గౌడ్, పవన్, జీవన్ రావు, గుండడి శేఖర్ పేర్కొన్నారు. మంగళవారం మెదక్ పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇటీవల కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన మామిళ్ళ ఆంజనేయులు, కంటారెడ్డి తిరుపతి రెడ్డి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. సమాజంలో గుర్తింపునిచ్చి పదవులను కట్టబెట్టిన కాంగ్రెస్‌ను పార్టీ వీడగానే తిట్టడం వారి అవివేకానికి నిదర్శనమన్నారు. మెదక్ కాంగ్రెస్ బరిలో ఉన్న మైనంపల్లి రోహిత్‌కు 25 ఏళ్ల వయస్సు లేదని, నియోజకవర్గంలోని గ్రామాలు తెలియవని, రాజకీయ అనుభవం లేదని వ్యాఖ్యానించడం సరికాదన్నారు. అదృష్టం, ప్రజల ఆదరణ ఉంటే పాతికేళ్ల కుర్రాడికి గెలిచే అవకాశాలు ఉన్నాయన్నారు. మనసులో ఒకటి, పైకి ఒకటి మాట్లాడే నైజం ఉన్న మామిళ్ళ ఆంజనేయులు ఓ రాజకీయ అజ్ఞాని అని తెలిపారు. కాంగ్రెస్ అంటే ఇష్టం లేకుంటే మరో పార్టీలోకి వెళ్ళాలి కానీ విమర్శించడం సరైన పద్ధతి కాదన్నారు. హవెలిఘనపూర్ మడలం జక్కన్నపేట గ్రామం నుంచి మెదక్ వస్తే కాంగ్రెస్ ఆదరించడం జరిగిందన్నారు. పీసీసీలో పదవి ఇచ్చారని తెలిపారు. మెదక్‌లో మూడు సార్లు మున్సిపల్ చైర్మెన్‌గా పనిచేసిన బట్టి జగపతి కొడుకుపై కౌన్సిలర్‌గా గెలిచావంటే అది కాంగ్రెస్ ఘనతేనని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే టిక్కెట్లు అమ్ముకుంటుందని ప్రచారం చేస్తున్నప్పుడు 15 ఏళ్ల నుంచి కాంగ్రెస్‌లో ఎందుకు పనిచేశారని ప్రశ్నించారు. 15 ఏళ్లలో విజయశాంతి, ఉపేందర్ రెడ్డి లాంటి వారికి టిక్కెట్లు ఇచ్చినప్పుడు పార్టీ ఎందుకు మారలేదని ప్రశ్నించారు. గతంలో మెదక్ ఎమ్మెల్యేగా ఉన్న మైనంపల్లి ఎలాంటి అభివృద్ధి చేయలేదంటున్నారనే విమర్శలు వాస్తవమే అని ఒప్పుకుంటున్నాం. కానీ మెదక్ నుంచి ప్రభుత్వ కార్యాలయాలు తరలిపోతుంటే ఏం చేశావని నిలదీశారు. కాంగ్రెస్ పార్టీ పై ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఊరుకునే పరిస్థితి లేదని మండిపడ్డారు. కాంగ్రెస్‌ను తిట్టిన వారి గురించి దేవేందర్ రెడ్డికి చాలా ఎక్కువ విషయాలు తెలుసని, అలాంటి వ్యక్తులను ఎక్కడ పెట్టాలో అక్కడ పెడుతారని సంచలన వ్యాఖ్యలు చేశారు. తిరుపతి రెడ్డికి జిల్లా అధ్యక్ష పదవి ఎక్కడి నుంచి వచ్చిందని, కాంట్రాక్టులు చేసి, డబ్బులు ఇచ్చి పదవులు తెచ్చుకున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్‌కు కోవర్ట్‌గా చేసిన విషయం అందరికి తెలుసని, అందుకే అధిష్టానం టిక్కెట్ ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్‌పై చేస్తున్న దుష్ప్రచారాన్ని మానుకోవాలన్నారు. ఈ సమావేశంలో మాజీ కౌన్సిలర్ అనిల్ కుమారు, కండెల సాయిలు, ఐతారం నర్సింలు, నాయకులు మైపాల్, పోచయ్య, రాజు, భరత్ గౌడ్, శ్రీనివాస్ శివ తదితరులు ఉన్నారు.

ఆశా వర్కర్స్ యూనియన్ సమ్మె జయప్రదం



నవతెలంగాణ-మెదక్

గత 15 రోజులుగా సమ్మె చేస్తున్న ఆశా వర్కర్స్ యూనియన్ సమ్మె జయప్రదమైందని సీఐటీయూ జిల్లా కోశాధికారి కె. నర్సమ్మ, ఆశా జిల్లా కార్యదర్శి సావిత్రి పేర్కొన్నారు. సోమవారం మెదక్ కెవల్ కిషన్ భవనంలో ఆశా యూనియన్ జిల్లా అధ్యక్షులు కవిత అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా పని చేస్తున్న ఆశలకు ఇప్పటివరకు ఫిక్స్ వేతనం ఇవ్వకుండా ప్రభుత్వం వెట్టిచాకిరి చేయిస్తున్నందున సమ్మె చేసినట్లు చెప్పారు. ఆశా వర్కర్స్ సమ్మె సందర్భంగా 9వ తేదీన జరిగిన చలో హైదరాబాద్‌లో నిర్వహించిన ధర్నాలో యూనియన్‌తో ఆశా నాయకత్వంతో చర్చలు జరిపి ఆశా డిమాండ్లు పరిష్కారం చేస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ముగ్గురు ఐఏయస్ అధికారులు, యూనియన్ నాయకులను ఆ కమిటీలో సభ్యులుగా అవకాశం కల్పించారన్నారు. ఆశా వర్కర్లకు ఫిక్స్ డిమాండ్లను పరిష్కరిస్తామని ప్రభుత్వం హామీ ఇవ్వడంతో సమ్మె తాత్కాలికంగా వాయిదా వేశామన్నారు. సమ్మె జరిగినంత కాలం సమ్మెకు సహకరించిన ప్రజలకు, ప్రజాసంఘాలకు, పోలీసు శాఖకు, సహకరించిన ప్రతి ఒక్కరికి పేరు పేరున ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాణి, రాములమ్మ, స్వప్న, దేవమ్మ ఆశాలు పాల్గొన్నారు.

పార్టీ అభివృద్ధికి కష్టపడి పని చేయాలి

- ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలి
- మంత్రి హరీష్ రావు
- మనోహరాబాద్ మండలం సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లిన నాయకులు



నవతెలంగాణ-తూప్రాన్ రూరల్/మనోహరాబాద్

పార్టీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేయాలని మండలంలో ఎలాంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకురావాలని వాటిని వెంటనే పరిష్కరించే విధంగా కృషి చేయనున్నట్టు మంత్రి హరీష్ రావు నాయకులకు సూచించారు. మంగళవారం ఉమ్మడి మండలాల పీఏసీఎస్ చైర్మెన్ మెట్టు బాలకృష్ణారెడ్డి, సీనియర్ నాయకులు శివగోని పెంటా గౌడ్‌ల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మండలం నుంచి నాయకులు మంత్రి హరీష్ రావును కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్‌కు భారీ మెజార్టీతో గెలిపించే విధంగా ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేయాలని సూచించినట్టు తెలిపారు. మండలంలోని నాయకులు సర్పంచులు మండలంలోని కొన్ని గ్రామాలకు బీసీ బందు రాలేనట్టు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అలాగే మండలంలో ఎలాంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకురావాలని వెంటనే పరిష్కరిస్తానని సూచించినట్టు నాయకులు తెలిపారు. పార్టీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేయాలని తెలిపినట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు లక్ష్మారెడ్డి, ప్రభాకర్ రెడ్డి, ఉప సర్పంచ్లు శ్రీహరి గౌడ్, నవీన్, పాలాట నాయకులు పల్లపు రమేష్, శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

మాభూమి మాకే చెందాలి



నవతెలంగాణ-నిజాంపేట

మండల పరిధిలోని కే వెంకటాపూర్ గ్రామానికి చెందిన దళిత కుటుంబాలకు సంబంధించి 12 ఎకరాల 20 గుంటల భూమిని గ్రామంలోని కొందరు భూ కబ్జా చేయడానికి చూస్తున్నారని దళిత యువకులు తెలిపారు. మాభూమి మాకే చెందాలని ఎన్నో సంవత్సరాల నుంచి సాగు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. చదువు రాని అమాయకులను చూసి అగ్రవర్ణాల వారు తమ భూములను కబ్జా చేయడానికి చూస్తున్నారన్నారు. చట్ట ప్రకారం 1975 సంవత్సరంలో సర్వేనెంబర్ 169లో విస్తీర్ణం ఏకరం 7-20 గుంటల భూమి , సర్వేనెంబర్ లో 170 విస్తీర్ణం 5 ఎకరాల భూమిని విస్తీర్ణం ఏ.12-20 గుంటల భూమిని సీలింగ్ ఆక్ట్ ప్రకారం వెంకటాపూర్ కే ,గ్రామానికి చెందిన దళిత కుటుంబాలకు ప్రభుత్వం ఇవ్వడం జరిగిందన్నారు. ఇప్పుడు ప్రస్తుతం గ్రామానికి చెందిన అంజిరెడ్డి వారి వారసులు అక్రమంగా డబ్బు పలుకుబడితో పోలీసు యంత్రాంగాన్ని ఉపయోగించుకొని మహిళలు అని చూడకుండా భయభ్రాంతులకు గురిచేసి తమ భూములను ఖబ్జా చేసుకోవడానికి చూస్తున్నారన్నారు. ఇకనైనా అధికారులు1975 సీలింగ్ ఆక్ట్ ప్రకారం ఇచ్చిన భూమిని సాగు చేసుకుంటున్న ఎ.12-20 గుంటల భూమిని తిరిగి కబ్జా చేయడానికి చూస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, ఆర్డీవోకు వినతి పత్రం అందజేశామన్నారు. తమ భూములను కబ్జా చేయకుండా చూసి తమ ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమం అసైండ్ భూ సమితి జిల్లా అధ్యక్షులు బైండ్ల నందు, జనగామ స్వామి, రాజేందర్, మహేందర్, మైసయ్య, నరసయ్య, దళిత కుటుంబాలు తదితరులు పాల్గొన్నారు.

నూతన రకాలతో అధిక దిగుబడి



- మొక్కజొన్న పంటలను పరిశీలించిన ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు

నవతెలంగాణ-సిద్ధిపేట రూరల్

నూతన రకాలతో అధిక దిగుబడి పొందవచ్చని ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ నగేష్ కుమార్, డాక్టర్ సమీర్ అన్నారు. మంగళవారం సిద్దిపేట రూరల్ మండల తోర్నాల ఏరువాక కేంద్రం ద్వారా ఇరుకోడు, బుస్సాపూర్ గ్రామాల రైతులకు పంపిణీ చేసిన డిహెచ్ఎం206, డిహెచ్ఎం182 మొక్కజొన్న రకాల పంటలను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ జొన్న సంకర రకం జూలైలో అధిక వర్షాలు కురిసి, మళ్ళీ ఆగస్టులో బెట్ట ఉన్నప్పుడు కూడా పంట బాగా వచ్చిందని, అంతేకాక పురుగు తెగుళ్ళు తక్కువ వచ్చాయని రైతుల అభిప్రాయ పడ్డట్టు తెలిపారు. దాదాపుగా ఎకరానికి 35 నుంచి 40 క్వింటాళ్ల దిగుబడి రావచ్చునని ధీమా వక్తపరిచారు. ఈ కార్యక్రమంలో భారతీయ మొక్కజొన్న పరిశోధనా సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సునీల్ ఏరువాకేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ విజయ్, డాక్టర్ పల్లవి, వ్యవసాయ విస్తరణాధికారి ప్రేమ్‌సాయి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి పార్టీలో చేరుతున్నాం



నవతెలంగాణ-మిరుదొడ్డి

మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో దుబ్బాక నియోజకవర్గం అభివృద్ధిని చూసి అక్బర్ పేట భూంపల్లి మండలం రుద్రారం గ్రామానికి చెందిన వార్డ్ మెంబర్ అదే గ్రామానికి చెందిన యువకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ దుబ్బాక నియోజకవర్గం సిద్ధిపేట మాదిరిగా మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు యువతకు ప్రభుత్వం ఎంతగానో అండగా ఉందన్నారు పార్టీకి కార్యకర్తలు పునాదిలాంటి వాళ్ళని తెలిపారు రాబోయే ఎనికల్లో బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో రుద్రారం గ్రామస్తులు మురళి, లక్ష్మీ, నారాయణ తోపాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

దుబ్బాక తహసీల్దార్‌గా వెంకటరెడ్డి బాధ్యతల స్వీకరణ



నవతెలంగాణ-దుబ్బాక

దుబ్బాక నూతన తహసీల్దార్‌గా ఎన్.వెంకటరెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. పురపాలిక పరిధిలోగల నూతన సమీకృత కార్యాలయ భవనంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆయన బాధ్యతలను స్వీకరించారు. ప్రస్తుతం బెజ్జంకి తహసీల్దార్‌గా పనిచేస్తున్న వెంకటరెడ్డి దుబ్బాకకు బదిలీపై వచ్చారు. ఇదివరకున్న తహసీల్దార్ జే.జయంత్ అక్బర్‌పేట-భూంపల్లి మండలానికి బదిలీ అయ్యారు.

చోరీ జరిగిన 24 గంటల్లో నిందితులను పట్టుకున్న పోలీసులు



నవతెలంగాణ-మిరుదొడ్డి

అంగన్వాడీ కేంద్రంలో చోరీ జరిగిన కేసును 24 గంటల్లో నిందితులను పోలీసులు పట్టుకున్నారు. మిరుదొడ్డి మండలం ధర్మారం గ్రామంలో అంగన్వాడీ కేంద్రంలో జరిగిన చోరీ జరిగిన కేసును 24 గంటల్లో పోలీసులు చేదించారు. అంగన్వాడి కేంద్రంలో ఎత్తుకెళ్లిన సరుకులపై సీఎం కేసీఆర్ బొమ్మ ఉండడంతో అనుమానంతో నిందితుడి ఇంట్లో పోలీసులు వెతకడంతో ఎత్తుకెళ్లిన సరుకులు లభించాయని ఎస్ఐ నరేష్ తెలిపారు. గ్రామానికి చెందిన నిందితుడు అరవింద్‌ను అదుపులోకి తీసుకోవడంతో పాటు సరుకులను రికవరీ చేయడం జరిగిందని వెల్లడించారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా తిరిగితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్సై సూచించారు.

రాజకీయ పార్టీల పోస్టర్లు జెండాల తొలగింపు



నవతెలంగాణ-మద్దూరు

తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికల కోడ్ వచ్చిన సందర్భంగా మద్దూరు, గాగిల్లాపూర్ గ్రామాలలో ప్రధాన కూడలిలో ఉన్న రాజకీయ పార్టీలకు సంబంధించిన పోస్టర్లు, జెండాలను పంచాయతీ కార్యదర్శి గద్ద వెంకటేశ్వర్లు, రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎలక్షన్ కోడ్ అమల్లో ఉన్నందున ఎలాంటి రాజకీయాల సంబంధించిన పోస్టర్లుగాని జెండాలు వేయకూడదు అని వారు తెలిపారు.

డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా కే.భవాని బాధ్యతల స్వీకరణ



నవతెలంగాణ -దుబ్బాక

దుబ్బాక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ కే.భవాని బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇదే డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్‌గా పనిచేశారు. ప్రస్తుతం సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్)లో బోధిస్తున్న ఆమె పదోన్నతిపై దుబ్బాకకు వచ్చారు.

నూతన ప్రధానోపాధ్యాయులకు ఘన సన్మానం



నవతెలంగాణ-బెజ్జంకి

మండల కేంద్రంలోని బాలికలు, బాలురు, కేజీబీవీ, గాగీల్లపూర్, రేగులపల్లి, కల్లేపల్లి, దాచారం, తోటపల్లి ప్రభుత్వోన్నత పాఠశాల్లో ప్రధానోపాధ్యాయులు నూతనంగా బాధ్యతలు చేపట్టారు. ప్రధానోపాధ్యాయులు శ్రీరాములు, కృష్ణ కుమారి, శ్వేత, పవన్ సింగ్, భారతి, మహతి లక్ష్మి, రేవతిలను మంగళవారం మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో ఎస్టీయూ, యూటీఎఫ్,డీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘాల ఉపాధ్యాయులు, ఎంఈఓ పావని కలిసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయుడిగా పురస్కారం అందుకున్న రజనీశ్ రెడ్డిని ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. మండలంలో విద్యాభివృద్ధి కార్యక్రమాలకు ఎల్లవేళల అందుబాటులో ఉంటామని నూతన ప్రధానోపాధ్యాయులు తెలిపినట్టు ఎస్టీయూ జిల్లా ఆర్థిక కార్యదర్శి వడ్లకొండ శ్రీనివాస్ తెలిపారు.

రాష్ట్ర విద్య వైజ్ఞానిక రజతోత్సవ మహాసభలను జయప్రదం చేయండి

- డిటీఎఫ్ మండల నాయకులు



నవతెలంగాణ-కోహెడ

మహబూబ్‌నగర్ పట్టణంలోని అన్నపూర్ణ గార్డెన్స్‌లో ఈ నెల 15, 16, 17 తేదిలలో నిర్వహిస్తున్న రాష్ట్ర విద్యవైజ్ఞానిక రజతోత్సవ మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి ఉల్లి సమ్మయ్య కోరారు. మండలంలోని శ్రీరాములపల్లి గ్రామంలో మహాసభల గోడపత్రికను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగంలో వస్తున్న నూతన ధోరణులు, పరిణామాలు, విద్యారంగ, వృత్తి సమస్యలు సామాజిక అంశాలపై దేశంలోని రాష్ట్రంలోని ప్రావీణ్యంగల వక్తలు విద్యావేత్తలు, అధ్యాపకులు పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ సభలకు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్ష కార్యదర్శులు అనుమాండ్ల రవీందర్‌రెడ్డి, మౌటం సత్తయ్య, జిల్లా ఆడిట్ మెంబర్ తొగిటి సత్యనారాయణ, జిల్లా కౌన్సిలర్లు మార్క శ్రీనివాస్, భీంరెడ్డి సురేందర్‌రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, బిట్ల శ్రీనివాస్, ఉపాధ్యాయులు పొన్నాల బాలయ్య, రాజ శేఖర్, క్రిష్ణా తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో ఎన్నికల కోడ్ అమలు







- 24 గంటల్లో పార్టీ ప్రచార ఫ్లెక్సీలు, బ్యానర్లను తొలగిస్తాం
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

నవతెలంగాణ-సిద్దిపేట్ కలెక్టరేట్

ఎన్నికల షెడ్యూల్ విడుదలైన సందర్భంగా ఎన్నికల ప్రవర్తన నియమాళి వచ్చిందని 24 గంటల వ్యవధిలో ప్రభుత్వ కార్యాలయల్లో రాజకీయ పార్టీల ప్రచార ఫ్లెక్సీలు ప్రకటనలు గోడలపై రాతలు బ్యానర్లు తొలగిస్తామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలీస్ కమిషనర్ శ్వేత, అదనపు పాలనాధికారి గరిమ అగర్వాల్ జిల్లా పౌర సంబంధాల అధికారి రవికుమార్, ఎంపీఓ తహసీల్దార్ ఇతర అధికారులతో కలిసి ఎన్నికల ప్రక్రియ జరుగుతుందన్నారు. నిష్పక్షపాతంగా శాంతియుతంగా నిర్వహిస్తామన్నారు. పోలింగ్ విధులకు 5526 మంది సిబ్బంది అవసరం ఉంటుందన్నారు. ఒక్కో పోలింగ్ కేంద్రంలో నలుగురు ఉంటారని, ఓటింగ్ ప్రక్రియను సజావుగా సాగించడంలో సిబ్బంది కీలకంగా వ్యవహరిస్తారన్నారు. నియోజకవర్గానికి మూడు చొప్పున ఫ్లయింగ్ స్క్వాడ్ ఎం సి సి, వి ఎస్ టి, ఎస్ ఎస్ టి బృందాలు ఏర్పాటు చేశామన్నారు. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ సేవలు అందుబాటులోకి వచ్చాయని, టోల్ ఫ్రీ నెంబర్ 1950 ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సమావేశాలు ర్యాలీల ప్రదర్శనలకు కచ్చితంగా ఆన్లైన్ విధానంలో అనుమతి తీసుకోవాలన్నారు. ఈ మేరకు సువిధ ఈసీఐ గవర్నమెంట్ ఇన్ వెబ్ సైట్ ద్వారా దరఖాస్తులు సమర్పించాలన్నారు. సాధారణ ఎన్నికలలో ఇంట్లో నుంచి ఓటింగ్ విధానం మొదటిసారిగా పోస్టల్ బ్యాలెట్ విధానంలో ఈసారి అందుబాటులోకి రానుందన్నారు. ఈసారి 80 ఏళ్ళు దాటిన వృద్ధులు దివ్యాంగులు నవంబర్ 8వ తేదీ లోపు రిటర్నింగ్ అధికారికి దరఖాస్తు చేయాలన్నారు. మీడియాలో రాజకీయ పార్టీల ప్రకటనలను ప్రచురించాలంటే అనుమతి అవసరం జిల్లాలో లైసెన్స్ కలిగిన గన్స్ 28 ఉండగా ఈ నెల 16వ తేదీ లోపు పోలీస్ స్టేషన్లో భద్రపరచాలన్నారు. ఇప్పటికే నోటీసులు జారీ చేశామని, ఎన్నికల ఏర్పాట్లపై హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్ష నిర్వహించారు సిద్ధిపేట్ కలెక్టరేట్ జిల్లా ఎన్నికల అధికారి యైయుండి పాలన అధికారి ప్రశాంత్ జీవన్ పాటిల్, పోలీస్ కమీషనర్ శ్వేత, అదనపు పాలనధికారి గరిమా అగర్వాల్, ఆర్డిఓలు, రమేష్ బాబు, బన్సీలాల్ బెన్ సాలెం, అదనపు డీసీపీ శ్రీనివాస్ రావు ఎన్నికల, విభాగం సూపరింటెండెంట్ రామేశ్వర్ పాల్గొన్నారు.

కీలకం కానున్న మహిళా ఓటర్లు

- దుబ్బాకలో పురుషులకంటే మహిళ ఓటర్లు ఎక్కువ



నవతెలంగాణ- సిద్దిపేట

నవంబర్ 30న జరిగే సాధారణ అసెంబ్లీ ఎన్నికలలో జిల్లాలో మహిళా ఓటర్లు కీలకం కానున్నారు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలలో పురుషులకంటే అధికంగా మహిళా ఓటర్ల నమోదు ఎక్కువగా ఉంది. అత్యధికంగా దుబ్బాకలో పురుషుల కంటే 4054 మంది మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. అన్ని రంగాలలో నేడు తమ సత్తాను చాటుతున్న మహిళలు, జిల్లాలో మొత్తం 9,25,398 మంది ఓటర్లు ఉన్నారు. అందులో 4,68,140 మంది మహిళా ఓటర్ల ఉండగా, 4,57,178 మంది పురుష ఓటర్లు, 80 మంది ఇతరులు ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా 10,962 మంది మహిళ ఓటర్లు ఎక్కువగా ఉన్నారు.

అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటర్లు

సిద్ధిపేట జిల్లాలో హుస్నాబాద్, సిద్ధిపేట, దుబ్బాక, గజ్వేల్ నియోజకవర్గాలు ఉన్నాయి. అక్టోబర్ మొదటివారం నాటికి ప్రభుత్వ అధికారుల లెక్కల ప్రకారం జిల్లాలో ఓటర్ల సంఖ్య 9, 25, 398 నమోదయి ఉన్నారు. హుస్నాబాద్‌ఖఎ 117165(పు)- 119406(మ)- 4(ఇ)- మొత్తం 2,36,575. కాగా 2241 మంది మహిళ ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. సిద్ధిపేటలో 112934(పు)- 115520(మ)- 69(ఇ)- మొత్తం 2,28, 523. కాగా2586 మంది మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. దుబ్బాకలో 95305(పు)- 99359(మ)- 0(ఇ)- మొత్తం 1,94,664 . కాగా 4054 మంది మహిళ ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. గజ్వేల్‌లో 131774(పు) - 133855(మ)- 7(ఇ)- మొత్తం 2,65,636. కాగా 2081 మంది మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. నియోజకవర్గం వారీగా చూసుకుంటే దుబ్బాక నియోజకవర్గంలో అత్యధికంగా మహిళ ఓటర్లు ఉన్నారు. ప్రతి నియోజకవర్గంలో మహిళా ఓటర్ల సంఖ్య పురుషుల కంటే అధికంగా ఉండడంతో, ఎన్నికలలో పోటీ చేసే నాయకులు మహిళలను ఆకట్టుకునే విధంగా తమ ప్రచారాలను కొనసాగిస్తేనే గెలిచే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

రైతుల రుణమాఫీ ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలి

- జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్



నవతెలంగాణ-సిద్దిపట కలెక్టరేట్

రైతులకు రుణ మాఫీ ప్రక్రియ, కొత్త రుణాల పంపిణీ ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ తెలిపారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లాలోని బ్యాంకు అధికారులు, వ్యవసాయ అధికారులతో రైతుల రుణమాఫీ ప్రక్రియ, కొత్త రుణాల పంపిణీ పై మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఎపిజివిబిలో 7876 మంది రైతులకుగాను రూ.33.26కోట్లు, ఎస్బీఐ బ్యాంకులో 2740మంది రైతులకుగాను రూ.21.92కోట్లు, యుబిఐ బ్యాంకులో2762 రైతులకుగాను రూ.15.45కోట్లు, ఇతరత్రా బ్యాంకులలో సుమారు 10272 అకౌంట్లకుగాను 25కోట్ల పెండింగ్ రైతు రుణమాఫీ నగదును వేగంగా రైతులకు అందజేయాలని బ్యాంకర్లకు తెలిపారు. ఇప్పటి వరకు జిల్లాలో 1,72,592 మంది రైతులకుగాను రూ.1320.68కోట్లు మంజూరు కాగా 90,471 మంది రైతుల ఖాతాల్లో రుణమాఫీ రూ.496.4కోట్లు అకౌంట్ జమ చేయబడ్డాయి. ఇప్పటి వరకు 66,272 రైతులు రూ.394.71కోట్ల నగదు రూపంలో రైతులు వారి ఖాతా నుంచి తీసుకోవడం జరిగిందన్నారు. మిగత దాదాపు 11,346 మంది రైతులు క్రాప్ లోన్ రినివల్ చేసుకోవాలని కోరారు. వివిధ బ్యాంకుల్లో పెండింగ్ లో ఉన్న రుణాలను త్వరగా పూర్తి చేయాలన్నారు. బ్యాంకు మేనేజర్లు, ఆర్ఎంలు పూర్తి వివరాలతో కూడిన సమాచారాన్ని వేగంగా తనకు అందించాలని ఎల్డిఎంను ఆదేశించారు. తదుపరి సమాచారాన్ని వ్యవసాయ అధికారులకు అందించాలని తెలిపారు. తప్పనిసరిగా సమావేశాలను బ్యాంకర్ల ఆర్ఎంలు కచ్చితంగా హాజరుకావాలని లేని పక్షంలో కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున బ్యాంకు, వ్యవసాయ అధికారులు ఎలక్షన్ కమీషన్ జారీ చేసిన మార్గదర్శకాలు తప్పనిసరిగా పాటించాలి. ఈ సమావేశంలో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ సత్యజిత్, డిఆర్డిఏ పిడి జయదేవ్ ఆర్యా, పీడి మెప్మా హనుమంత రెడ్డి, యుబిఐ ఆర్ఎచ్ వికాస్, ఎపిజివిబి ఆర్ఎం ఉదయ్ కిరణ్, టిజిబి ఆర్ఎం లక్షణ్, బ్యాంకు రిజనల్ అధికారులు, మెప్మా అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ సాధన కోసం జేఏసీ పోరాటాలకు అండగా ఉంటాం

- ఫోటో, వీడియో గ్రాఫర్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్



నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధన కోసం జేఏసీ ఆధ్వర్యంలో చేస్తున్న పోరాటాలకు అండగా ఉంటామని ఫోటో, వీడియో గ్రాఫర్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు దొంతుల శ్రీకాంత్ తెలిపారు. చేర్యాల రెవెన్యూ డివిజన్ కోసం జేఏసీ ఆధ్వర్యంలో చేర్యాల పట్టణ కేంద్రంలోని పాత బస్టాండ్ వద్ద చేస్తున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారం 30వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో నాలుగు మండలాల ఫోటో, వీడియో గ్రాఫర్ అసోసియేషన్ నాయకులు కూర్చున్నారు. వారికి వివిధ పార్టీల నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధన కోసం జేఏసీగా కొన్ని సంవత్సరాలుగా అనేక పోరాటాలు నిర్వహిస్తుంటే ప్రభుత్వంలో ఎలాంటి చలనం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంత నాలుగు మండలాల ప్రజల చిరకాల కోరిక ఆకాంక్షను ప్రభుత్వం వెంటనే గుర్తించి రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ ఉద్యమంలో వీడియో, ఫోటోగ్రాఫర్లు సంపూర్ణ మద్దతు తెలుపుతూ భాగస్వాములు అవుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫోటో వీడియో గ్రాఫర్స్ యూనియన్ అధ్యక్షులు గుడాల రాజు, ప్రధాన కార్యదర్శి ఇప్పకాయల పవన్, కోశాధికారి కోయినేని శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు రాజగిరి గోవర్ధన్, కడుదూరి మహేందర్ రెడ్డి, కర్క చంద్రారెడ్డి, కొమురవెల్లి అధ్యక్షులు చిప్ప శ్రీనివాస్, ధూల్మిట్ట అధ్యక్షులు గొంటిపల్లి కిషన్, కూరపాటి మదు, తాడెం యాదగిరి, నర్సింగరావు, హరి, సురేష్, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

ఘనంగా అంతర్జాతీయ మానసిక ఆరోగ్య దినోత్సవం



నవతెలంగాణ-గజ్వేల్

పిల్లల మానవ వనరుల కేంద్రంలో మండల్ లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మానసిక ఆరోగ్య దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ శ్రీమతి సౌమ్య మాట్లాడుతూ ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం 2023 అనేది జ్ఞానాన్ని మెరుగుపరచడానికి, అవగాహన పెంచడానికి, సార్వత్రిక మానవ హక్కుగా ప్రతి ఒక్కరి మానసిక ఆరోగ్యాన్ని ప్రోత్సహించే రక్షించే చర్యలను నడపడానికి 'మానసిక ఆరోగ్యం సార్వత్రిక మానవ హక్కు" అనే థీమ్ ముందుకు సాగాలన్నారు. మానసిక ఆరోగ్యం ప్రజలందరికీ ప్రాథమిక మానవ హక్కు. ప్రతి ఒక్కరూ, ఎవరు, ఎక్కడ ఉన్నా, మానసిక ఆరోగ్యం అత్యున్నత స్థాయిని పొందే హక్కు ఉందన్నారు. ఇందులో మానసిక ఆరోగ్య ప్రమాదాల నుంచి రక్షించబడే హక్కు, అందుబాటులో ఉండే, ఆమోదయోగ్యమైన మంచి నాణ్యమైన సంరక్షణ హక్కు సమాజంలో స్వేచ్ఛ, స్వాతంత్ర్యం చేర్చుకునే హక్కు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల సంక్షేమ సమితి సభ్యులు దేశబోయిని నర్సింహులు మండల లీగల్ సర్వీస్ సిబంది నర్సింహా చారి, యామిని ప్రత్యేక అవసరాలు గల కేంద్రం నిర్వాహకులు హరిత, రమ్య తదితలరు పాల్గొన్నారు.

దమ్మక్క పల్లిలో ఉచిత మెగా వైద్య శిబిరం



నవతెలంగాణ-కొండపాక

మండల పరిధిలోని దమ్మక్కపల్లి గ్రామంలో స్థానిక సర్పంచ్ నీల మల్లేశం ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా శిబిరంలో గ్రామస్తులకు బీపీ, షుగర్ పరీక్షలు, కంటి పరీక్షలతో పాటు చెవి, ముక్కు, గొంతు, వరిబీజము, బీజకుట్టు, గడ్డలు, కనతులు, థైరాయిడ్ గడ్డలు, గర్భ సంచికి సంబంధించిన సమస్యలు, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, చర్మ సమస్యలు, మోకాళ్ళ నొప్పులు, నడుము నొప్పులు, ఊపిరితిత్తుల సమస్యలు చూసి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ వైద్య శిబిరంలో ఓ పి 120 మందికి షుగర్, బీపీ, టెస్టులు చేశారు. ఆపరేషన్ అవసరమున్న 35 మందిని రిఫర్ చేయడం జరిగిందన్నారు. వీరిని మెడిసిటీ హాస్పిటల్‌కు తరలించి ఉచిత ఆపరేషన్లు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అఖిల్ డాక్టర్ భాస్కర్ ఆనంద్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో అమలు కాని ఎన్నికల కోడ్



నవతెలంగాణ- సిద్దిపేట

ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచే ఎన్నికల కోడ్ వర్తిస్తుందని అధికారులు చెబుతున్నారు. వచ్చే నెల 30న రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ఈ నెల 9 నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి ప్రశాంత్ జె పాటిల్ తెలిపారు. జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలలో ఉంటుందన్నారు. కానీ పట్టణంలో అది కనిపించడం లేదు. ప్రభుత్వ కార్యాలయంలో ఉన్న పొలిటికల్ ఫంక్షనరీల ఫోటోలను 24 గంటల్లోగా, ప్రభుత్వ స్థలాలు స్థలాలలో ఉన్న రాజకీయ పార్టీల పోస్టర్లు, బ్యానర్లను, గోడలపై రాతలను 48 గంటల లోగా తొలగించాలని నిబంధన ఉంది. ప్రైవేట్ స్థలాలలో ఉన్న వాటిని ఆయా స్థలాల ఓనర్లు ఒప్పుకోకపోతే 72 గంటలలో తొలగించేందుకు ప్రభుత్వ అధికారులు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. కానీ అవి అమలయితున్నట్లు పట్టణంలో కనిపించడం లేదు.

కోడ్ పట్టని వైనం

- సంగారెడ్డి, సిద్దిపేటలో బీఆర్ఎస్ ఫ్లెక్సీలు



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

ఎన్నికల కోడ్ అమలు చేయాల్సిన అధికారుల్లో కొందరు నిర్మితంగా వ్యవహరిస్తున్నారు. సంగారెడ్డి , సిద్దిపేట, మెదక్ జిల్లా కలెక్టర్ల నేతృత్వంలో ఎన్నికల కోడ్ అమలుకు చర్యలు తీసుకుంటున్నారు. రాజకీయ పార్టీలకు సంబంధించిన ఫ్లెక్సీలు ఓటింగ్‌లు పెద్ద పెద్ద కటౌట్ల తొలగించినప్పటికీ అక్కడక్కడ ఇంకా ఫ్లెక్సీలు, బోర్డులు, కటౌట్లు కనిపిస్తున్నాయి సంగారెడ్డి పట్టణంలో హైవేపై చాలాచోట్ల బీఆర్ఎస్ కు చెందిన ఫ్లెక్సీలు కట్‌అవుట్లు తొలగించకుండా అట్లనే దర్శనమిస్తున్నాయి సిద్దిపేట పట్టణంలో సైతం పలుచోట్ల టిఆర్ఎస్కు చెందిన ప్రచార హోల్డింగ్లు భారీ ఫ్లెక్సీలు తొలగించుకుని నేర్చుకోలేదు ఇతర ప్రాంతాల్లో కూడా అక్కడక్కడ గోడ రాతలు పోస్టర్లు ఇతర ప్రచార సామాగ్రిని తొలగించడంలో మున్సిపల్ అధికారులు అప్రమత్తంగా లేరనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎన్నికల షెడ్యూల్ ప్రకటన వచ్చిన మరుక్షణమే కోడ్ అమల్లోకి వచ్చిన విషయం మూడు జిల్లాల ఎన్నికల అధికారులుగా ఉన్న కలెక్టర్లు 11 నియోజకవర్గాల ఎన్నికల రిటర్నింగ్ అధికారులు ఎన్నికల కోడ్‌ను విధిగా అమలు చేయించాల్సి ఉన్నది. ఇప్పటికే పలుచోట్ల విగ్రహాలకు ముసుగులు వేయడం బ్యానర్లు ఫ్లెక్సీలు తొలగించడం పోస్టర్లు గోడ రాతలను తొలగించడం వంటి చర్యలను తీసుకున్నప్పటికీ పూర్తిస్థాయిలో చేయలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి ప్రధాన కూడలిలోనే కాకుండా ప్రధాన రహదారుల వెంట భారీ భవనాలపై పెట్టిన హోల్డింగ్లు ఫ్లెక్సీలను తొలగించడంలో మున్సిపల్ అధికారులు పక్షపాత వైఖరి అనుసరిస్తున్నారనే విమర్శ వినిపిస్తున్నది. పార్టీలకతీతంగా ఎన్నికల కోడ్ అమలు చేయాల్సిన అధికారులు పూర్తిస్థాయిలో ఫ్లెక్సీలు బోర్డులను తొలగించడంలో విఫలమవుతున్నారనే మాట వినిపిస్తుంది. ఇప్పటికైనా అక్కడక్కడ కనిపిస్తున్న ఫ్లెక్సీలు, భారీ బ్యానర్లు, కటౌట్లను వెంటనే తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

జిల్లాలో పత్తి కొనుగోళ్లు సాఫీగా జరగాలి

- అదనపు కలెక్టర్ మాధురి



నవతెలంగాణ- మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

జిల్లాలో రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా పత్తి కొనుగోళ్ళు సాఫీగా జరిగేలా సహకరించాలని అదనపు కలెక్టర్ మాధురి జిన్నింగ్ మిల్లుల యజమానులను కోరారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులు, జిన్నింగ్ మిల్లుల యజమానులతో పత్తి కొనుగోళ్లపై ఆయా శాఖలు చేపట్టాల్సిన చర్యలపై సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2023-24 సం. వానాకాలం జిల్లాలో 3,58,690 ఎకరాలలో రైతులు పత్తి పంట వేసారని, సుమారు 2.51 లక్షల మెట్రిక్ టన్నుల పత్తి వచ్చే అవకాశం ఉన్నట్లు అంచనా వేయడం జరిగిందన్నారు. పత్తి నిల్వకు జిల్లాలో 37 గోడౌన్లు అందుబాటులో ఉన్నాయన్నారు. బయోమెట్రిక్ డాటా బేస్ తోనే సిసిఐ కొనుగోలు చేస్తుందన్నారు. రైతు పట్టా పాస్ బుక్‌తో ఆధార్ లింక్ ఉండాలన్నారు. బాగా ఆరిన, తేమశాతం తక్కువగా ఉంటే ఎక్కువ ఎం ఎస్ పి లభిస్తుందని రైతులకు అవగాహన కల్పించాలని, జిన్నింగ్ మిల్లుల యజమానులకు వ్యవసాయ శాఖ అధికారికి సూచించారు. 8 శాతం లోపు తేమ గల పత్తికి కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ.7,020/-గా లభిస్తుందని తెలిపారు. ఆయా అధికారులు తమ తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. జిన్నింగ్ మిల్లుల యజమానులు పత్తి కొనుగోలు కేంద్రాలలో అవసరమైన ఎక్విప్మెంట్‌ను ఏర్పాటు చేసుకోవాలని, అదేవిధంగా రైతులకు తాగునీరు, టాయిలెట్స్, తదితర కనీస సదుపాయాలు కల్పించాలని సూచించారు. ఎక్కడ ఎలాంటి సమస్యలు కలుగకుండా సజావుగా కొనుగోళ్లకు సిద్ధం కావాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా మార్కెటింగ్ అధికారి మొహమ్మద్ రియాజ్, వ్యవసాయ శాఖ జెడి నరసింహారావు, ఆర్‌టిఏ, లీగల్ మెట్రాలజీ, అగ్నిమాపక,పోలీస్, సిసిఐ అధికారులు, మార్కెట్ కమిటీ సెక్రటరీలు, జిన్నింగ్ మిల్లుల యజమానులు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆరు గ్యారంటీ పథకాలతో బీఆర్ఎస్ అడ్రస్ గల్లంతు



నవతెలంగాణ-నంగునూరు

కాంగ్రెస్ ఆరు గ్యారంటీ పథకాలతో బీఆర్ఎస్ అడ్రస్ గల్లంతుందనే భయంతో భయంతో కేటీఆర్, హరీష్ రావులు పిచ్చి కూతలు కూస్తున్నారని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి దేవులపల్లి యాదగిరి పేర్కొన్నారు. నంగునూరులో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారం ముసుగులో అవినీతి సొమ్ము తినుడు అలవాటు పడ్డ కేటీఆర్, హరీష్ రావులు కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన పథకాలకు ప్రజలలో మంచి స్పందన రావడం శుభపరిణామం అన్నారు. ఓటమి తప్పదన్న చేదు నిజాన్ని జీర్ణించుకోలేని కేసీఆర్ కుటుంబం వ్యక్తిగత దూషణలు చేయడం తగదన్నారు. రెండు సార్లు అధికారంలోకి వచ్చి ప్రజల సంక్షేమాన్ని మర్చిపోయిన కేసీఆర్, మరోసారి దొంగ హామీలతో అధికారంలోకి వస్తామని పగటి కళలు కంటున్నాడని దుయ్యబట్టారు. తెలంగాణా ఇచ్చిన కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ప్రజలు నమ్ముతారని వారి నమ్మకాన్ని రాహుల్ గాంధీ నిజం చేస్తారని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలు కోరుకుంటున్న కాంగ్రెస్ పార్టిని నాయకులను విమర్శిస్తే బీఆర్ఎస్ పార్టీకి, కేటీఆర్‌కు హరీష్ రావు లకు పుట్టగతులు ఉండవని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చెలికా యాదగిరి, రాగుల కృష్ణ, జంగిటి శ్రీనివాస్, దేవులపల్లి చింటూ, దేవులపల్లి శ్రీకాంత్, తిరుపతి, లక్ష్మన్, జంగిటి సంపత్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

అంచలంచెలుగా అల్వాల అభివృద్ధి

- మంత్రి, ఎంపీ సహాయంతోని ప్రత్యేక నిధులు
- వైస్ ఎంపీపీ పోలీస్ రాజులు







నవతెలంగాణ-మిరుదొడ్డి

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత అంచలంచెలుగా అల్వాల గ్రామం మరింత అభివృద్ధి చెందింది. గ్రామంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె ప్రగతితో పాటు అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతూ గ్రామం మరింత అభివృద్ధి చెందడానికి ఎంతగానో కృషి జరుగుతుందని వైస్ ఎంపీపీ పోలీసు రాజులు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న అల్వాలను అభివృద్ధి పదం నడపడం పట్ల అల్వాల గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ఆర్థిక వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీష్ రావు మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డిల సహకారంతో ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తూ గ్రామాన్ని అభివృద్ధి చెందిన పట్ల అల్వాల గ్రామం పక్షాన ప్రత్యేకంగా వారికి వైస్ ఎంపీపీ పోలీస్ రాజులు సర్పంచ్ కిష్టయ్య ధన్యవాదాలు తెలిపారు. అల్వాల గ్రామంలో మంత్రి హరీష్ రావు ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి ల సహకారంతో పదిలక్షల ముదిరాజ్ భవనము, ఎస్సీ కమిటీ హాల్ 10 లక్షలు మార్కెట్ గోదాం 16 లక్షలు నూతన గ్రామపంచాయతీ భవనానికి 18 లక్షలు 16 లక్షలు తోపాటు గ్రామంలో సిసి రోడ్లు గ్రామంలో సిసి రోడ్లు మురికి కాలువ లు, డంపు యాడు స్మశాన వాటిక ఎస్సీ బీసీ కమిటీ హాల్‌తో పాటు అనేక రకాలుగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని తెలిపారు. మన ఊరు మనబడి కార్యక్రమంలో భాగంగా పాఠశాల అభివృద్ధి వంటి కార్యక్రమాలను చేపట్టడం ఎంతో సంతోషకరంగా ఉందని తెలిపారు. గ్రామంలో తెలం గాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కులవృత్తులకు మరియు వృద్ధులకు వికలాంగులకు ఆసరాపించిన అందించింది తెలంగాణ ప్రభుత్వమేనని వారు అన్నారు ముఖ్యమంత్రి కేసీఆర్ చొరవతో గ్రామాల్లో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేయడం సంతోషకరమన్నారు పేద బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందని తెలిపారు ప్రతి ఇంటింటికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందే విధంగా ఈ యొక్క ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు పేదోడికి అండగా ప్రభుత్వం ఉందని మనం సూటిగా చెప్పకపోవచ్చున్నారు మంత్రి హరీష్ రావు ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి లు దుబ్బాక నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందడానికి వారు చేసిన కృషి మరువలేదన్నారు.

అభివృద్ధి చేశాను.. ఆశీర్వదించండి

- కల్లెపల్లి ఆశీర్వాద సభలో ఎమ్మెల్యే రసమయి విజ్ఞప్తి



నవతెలంగాణ-బెజ్జంకి

మెట్టప్రాంతమైన మండలాన్ని గోదారి నీళ్లతో సస్యశామలం చేశానని..బురదరోడ్లతో దర్శనమిచ్చిన గ్రామీణ రోడ్లన్ని సీసీ రోడ్లతో, కుల, మహిళ సంఘాలు, నూతన గ్రామ పంచాయతీ భవనాలతో పాటు సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్ రావు కృషితో మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని..రానున్న ఎన్నికల్లో ప్రజలు మళ్లీ తనను ఆశీర్వదించాలని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం మండల పరిధిలోని కల్లెపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ఆశీర్వాద సభలో ఎమ్మెల్యే రసమయి మాట్లాడారు. గత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆంధ్రపాలకుల చేతిలో తెలంగాణ రాష్ట్రంలోని బడుగుబలహీన వర్గాల ప్రజలెదుర్కొన్న కష్టాలను పాటల రూపంలో వెలుగులోకి తీసుకొచ్చి..తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలకపాత్ర పోషించి మానకొండూర్ నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదంతో రెండు దఫాలుగా ఎమ్మెల్యేగా ఎన్నికై.. రసమయి నువ్వు చేశావని ప్రశ్నిస్తున్న ప్రతిపక్షాలకు ఇదిగో ఇంత అభివృద్ధి చేశానని సగర్వంగా చెబుతున్నానన్నారు. అభివృద్ధి చేశాను కాబట్టే ప్రజలు మళ్లీ ఓట్లేసి అభివృద్ధికి పట్టం కట్టి..మళ్లీ ఆశీర్వదించమని అభ్యర్థిస్తున్నానన్నారు. ప్రభుత్వం అమలు చేసిన పలు సంక్షేమ పథకాలను మండలంలోని ఆయా గ్రామాల్లో ఇంటింటా చేర్చానన్నారు. ఎంపీపీ నిర్మల, జెడ్పీటీసీ కవిత,ఏఎంసీ చైర్మన్ చంద్రకళ, సర్పంచ్ దారం లక్ష్మి,వైస్ ఎంపీపీ చెలుకల సభిత, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, మండల, గ్రామ బీఆర్ఎస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సురభిలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం



- ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మాట్లాడుతున్న డాక్టర్లు

నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్

నేడు పెరుగుతున్న నాగరికతలో మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ఎంతో అవసరమని సురభి కళాశాల మానసిక వైద్య విభాగం డాక్టర్ హరీష్ పిన్నోజి అన్నారు. మంగళవారం సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి సమీపంలో ఉన్న సురభి సైన్స్ అండ్ మెడికల్ కళాశాలలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. డాక్టర్ల బృందం మాట్లాడుతూ నేటి ఆహారపు అలవాట్లు ధూమపానం, మద్యపానం, ఆలోచన విధానం, పనిలో ఉండే ఒత్తిడి వలన కలిగే మానసిక స్థితిగతుల గురించి వివరించారు. యోగా చేయడం వలన డాక్టర్ల సలహాలు సూచనలను పాటించడం వలన మానసిక ఆరోగ్యంతో పాటు శారీరక ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సూచించారు. సురభి కళాశాలలో మానసిక ఆరోగ్యానికి సంబంధించి అన్ని రకాల సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సూపర్ అండి డాక్టర్ శివరామ చారి, డాక్టర్ రాజేష్, డాక్టర్ రఫీ, పిఆర్వో పరుశరాములు పాల్గొన్నారు.

ఆత్మీయుడు బాపు రెడ్డి

- వర్ధంతి సభలో గ్రామస్తుల ఘన నివాళులు



నవతెలంగాణ-బెజ్జంకి

కుల, మత, వర్గ బేధం లేకుండా అంద రిని అప్యాతగా పలకరి స్తూ గ్రామ ప్రజల హృ దయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకుని, తనదైన శైలిలో గ్రామాభివృద్ధిలో కీలకపాత్ర పోషించి తన చెరగని ముద్రను వేసి సర్పంచ్ పెంద్యాల బాపు రెడ్డి అందరికి ఆత్మీయుడిగా నిలిచారని సర్పంచ్ ముక్కీస తిరుపతి రెడ్డి కొనియాడారు. మంగళవారం మండల పరిధిలోని లక్ష్మీపూర్ గ్రామ పంచాయతీ కార్యలయంలో సర్పంచ్ బాపు రెడ్డి ప్రథమ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ ముక్కీస పద్మ పంచాయతీ పాలకవర్గం సభ్యులు, పారిశుధ్య కార్మికులు, గ్రామస్తులు బాపు రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాలర్పించారు.

బీఆర్ఎస్‌లో చేరిన మర్మముల ఎన్ఆర్ఐ



నవతెలంగాణ-మద్దూరు

మద్దూరు మండలంలోని మర్మముల గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ ఇప్ప నిష్కాంత్ రెడ్డి 200 మందితో కలిసి మద్దూరు ఎంపీపీ బద్దిపడ కృష్ణారెడ్డి, ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి, సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్బంగా నిష్కాంత్ రెడ్డితో పాటు 200 మందికి పల్లా రాజేశ్వర్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎంపీపీ బద్దిపడగ కృష్ణారెడ్డి, మాట్లాడుతూ సీఎం కేసీఆర్ చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్ పార్టీలో ఎన్.ఆర్.ఐ తో పాటు 200 మంది గ్రామస్తులు చేరినట్లు ఆయన తెలిపారు. జనగామ ఎమ్మెల్యేగా పల్లా రాజేశ్వర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు బోయిని శ్రీనివాస్, బిఆర్ఎస్ మండల నాయకులు దాకూరి తిరుపతిరెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు కూస రాజు, తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు సహాయం



నవతెలంగాణ-కొండపాక

మండల కేంద్రమైన కొండపాకలో ఇటీవల మర ణించిన నిరుపేద కుటుంబాలకు చెందిన దొమ్మాట మహేష్, తంగళ్ళ నరసవ్వ కుటుంబాలను కాంగ్రెస్ పార్టీ ఎస్‌సి విభాగం జిల్లా అధ్యక్షులు విజయ్ కుమార్ పరామర్శించి తన సోదరుడు కొమ్ము మల్లేశం సహకారంతో బాధిత కుటుంబాలకు రూ. 5000 మహేష్ కుటుంబానికి, తంగెళ్ల నరసవ్వ కుటుంబానికి 50 కిలోల బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు ఏర్పుల మల్లేశం, వార్డు మెంబర్లు జంజీరపు నర్సింలు, కనకరాజు, బోకె రామచంద్ర, ప్రశాంత్ , చంద్రశేఖర్ పాల్గొన్నారు.

హుస్నాబాద్‌లో ఎగిరేది కాంగ్రెస్ జెండా

- పాత హామీలు నెరవేర్చని కేసీఆర్
- పార్టీ మండల అధ్యక్షుడు జంగపల్లి ఐలయ్య.



నవతెలంగాణ-అక్కన్నపేట

హుస్నాబాద్ ప్రాంతం కేవలం సెంటిమెంట్‌కే పరిమితమైందని అభివృద్ధిలో వెనుకబడిపోయిందని కాంగ్రెస్ పార్టీ స్థానిక మండల అధ్యక్షుడు జంగపల్లి ఐలయ్య మంగళవారం తెలిపారు. హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలను మరొక్కసారి మోసం చేయడానికి సీఎం కేసీఆర్ ప్రయత్నిస్తున్నారన్నారు. హుస్నాబాద్ ప్రాంతం మీద ఆయనకు ఆలోచన ఉంటే ఇప్పటికే అభివృద్ధి జరిగేదని అన్నారు. కనీసం గౌరవెల్లి ప్రాజెక్టు కూడా పూర్తి చేయని అన్నారు. నియోజకవర్గంలో ఎంతమందికి డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇచ్చారని ప్రశ్నించారు. పక్కనే ఉన్న సిద్దిపేట, సిరిసిల్ల అభివృద్ధిలో దూసుకుపోతుంటే , హుస్నాబాద్ ప్రాంతం ఎందుకు వెనుకబడిపోయిందని ప్రశ్నించారు. గౌరవెల్లి ప్రాజెక్టు కంటే వెనకాల మొదలైన రంగనాయక సాగర్, కొండపోచమ్మ ప్రాజెక్టులు ఎలా పూర్తయ్యాయని, గౌరవెల్లి ప్రాజెక్టు ఎందుకు పూర్తి కాలేదని ప్రశ్నించారు. ఎక్కడ కూడా అభివృద్ధి చేయకుండా, ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు. ఏ మొహం పెట్టుకొని మళ్ళీ హుస్నాబాద్‌లో బహిరంగ సభ పెట్టడానికి వస్తున్నారని, తప్పకుండా కేసీఆర్ పర్యటనను అడ్డుకుంటామని ఐలయ్య హెచ్చరించారు. రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని అన్నారు.

అందరికంటే ముందే గెలిచొస్తా



నవతెలంగాణ-దుబ్బాక

2020 ఉప ఎన్నికల్లో అందరికంటే ముందే నామినేషన్ వేసి ముందుగానే ప్రచారం నిర్వహించానని అప్పుడు గెలిచినట్లే 2023 ఎన్నికల్లోనూ అందరికంటే ముందే గెలిచొస్తానని దుబ్బాక ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్ రావు అన్నారు. మంగళవారం దుబ్బాక పురపాలిక పరిధిలోని చేర్వాపూర్ వార్డులో గల మారెమ్మ దేవాలయంలో ప్రచార వాహనానికి ఎమ్మెల్యే రఘునందన్ రావు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాన్ని కళ్ళు తెరిపించిన ఉప ఎన్నికల విజయం వచ్చే ఎన్నికల్లోనూ విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. అదే అకుంఠిత దీక్షతో ప్రతి ఒక్కరు పనిచేసి దుబ్బాకలో బీజేపీ విజయానికి కంకణబద్ధులవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.